ఉష్ణోగ్రత (అంచనా) 8-6-2025

	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	28
తెనాలి	40	28
నరసరావుపేట	40	28
బాపట్ల	40	28
రెంటచింతల	41	28
చీరాల	40	28

చిన్నోడైనా.. చేసేసుకుంటాం

నచ్చితే చాలంటోన్న అమ్మాయిలు

- పెళ్లిపై మారుతున్న నవతరం స్వరం
- సంప్రదాయాలను కాదంటోన్న యువతరం
- తమ ఆకాంక్షలకు అనుగుణంగా అబ్బాయిల ఎంపిక
- నగరాలు, సెలబ్రిటీల నుంచి గ్రామాల్లోకి చొచ్చుకెళ్లిన వైనం



sunday special

పెళ్లి అంటే.. రెండు మనసులు.. మూడు ముళ్లు.. ఏడు అడుగులు. మన సంప్రదాయం ప్రకారం వయస్సు.. కులానికి పెద్దలు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. కానీ నేటి తరం ముఖ్యంగా యువతులు మనసుకు నచ్చితే చాలు.. అబ్బాయి చిన్నవాడైనా పర్లేదంటోంది. ఒకప్పుడు కొందరు సెలబ్రిటీల్లో కనిపించిన ఈ తరహా వివాహాలు ఇప్పుడు జన సామాన్యంలోకి వచ్చేశాయి. నగరాలకే పరిమితమైన ఈ ఆలోచనలు ఇప్పుడు గ్రామాలకు విస్తరించాయి. వరుడు కన్నా వధువు వయసు పెద్దగా ఉంటే అదో పెద్ద చర్చ ఒకప్పుడు కానీ ఇప్పుడు ఇది చాలా సాధారణ మైపోయింది. తాజాగా జరిగిన అఖిల్ వివాహం కూడా ఈ కోవ లోనిదేనని సమాచారం. కానీ ఈ విషయంపై ప్రజల్లో పెద్దగా చర్చ జరగకపోవడం ఆ తరహా వివాహాల ఆమోదానికి అద్దం పట్టేదిగా ఉంది. మనువు.. మనసుతో ముడిపడిన విషయం దానికి వయసు తారతమ్యం ఎందుకని యువతులు ప్రశ్నిస్తున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రేమకు రెండు మనసులు కలిస్తే చాలు. కానీ పెళ్లికి వయసులు కూడా కలవాల్సిందే. పెద్దలు కుదిర్చిన పెళ్లయితే ఇది తప్పనిసరి. అమ్మాయి కన్నా అబ్బాయి కనీసం ఓ రెండు మూడేళ్లయినా పెద్ద వాడై ఉండాలి. ఇదే సంప్రదా యం. అయితే ఈ తరం అమ్మాయి మారుతోంది. తన ఆలోచనలను మార్చుకుంటోంది. తన కేం కావాలో తెలుసుకుంటుంది. సాధించుకుంటోంది. పెళ్లికి మనసు ముఖ్యం కానీ వయసు కాదంటోంది. ఈ మార్పును అబ్బాయిలతో పాటు పెద్దలూ అంగీకరిస్తున్నారు. మేం తక్కు వేం టి... అబ్బాయి గొప్పేంటి? కలసి నడవాల్సిన మా మధ్య ఉండాల్సింది అవగాహన కదా.. వయసు అంతరమెందుకు? మనసుకు నచ్చినోడు మాకన్నా పెద్దవాడే కావాలంటే ఎలా? చిన్నోడైతే సమస్యేంటి? ఇవీ.. ఈ తరం అమ్మాయిల ఆలోచనలు. అమ్మాయిల్లో ఆర్థిక స్వాతంత్ర్యం పెరగడంతో వివాహం విష యంలో మిగతా వాటికన్నా తమ ఇష్టా నికే పెద్దపీట వేస్తున్నారు. మనది పురుషాధిక్య సమాజం కాబట్టే అబ్బాయి కన్నా అమ్మాయి చిన్నదై ఉండాలనే నిబంధన తెచ్చారనే భావన యువతుల్లో వ్యాపించింది. పెళ్లిపై అమ్మాయి స్వరం మారుతోంది. తమ ఆకాంక్షలకు అను గుణంగా జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకుం టున్నది. వయసులో తనకన్నా చిన్నవాడైనా పర్లేదంటోంది. మనసుకు నచ్చితే పెద్దలను (మిగతా 6వ పేజీలో)

నాడు సంచలనం..

ఆరోప్రాణం.. అప్పుడెప్పుడో తొంభయ్యో దశకంలో వచ్చిన సినిమా అది. అందులో హీరో వినీత్.. హీరోయిన్ సౌందర్య కన్నా రెండేళ్లు చిన్నవాడు. వారి ప్రేమకు అదే అడ్డంకి. దీన్ని అధిగమించి వారు ఎలా ఒక్కటయ్యారన్నదే కథ. అప్పట్లో ఈ సినిమా గురించి ఓ రేంజ్‌లో చర్చలు జరిగాయి. అదే తొంభయ్యో దశకంలోనే సచిన్ టెండూల్కర్.. తనకన్నా ఐదేళ్లు పెద్దమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అప్పట్లో అదో సంచలనం. ఈ విషయం గురించి చర్చించని గడప లేదంటే అతిశయోక్తి కాదు.

నేడు క్రేజీ..

తనకన్నా రెండు మూడేళ్ల వయసు తక్కువగా ఉన్నవాడిని చేసుకోవడం అమ్మాయిల్లో క్రేజీగా మారుతోంది. పల్లె సీమల్లో వివిధ కారణాలతో ఇలాంటి వివాహాలకు అనుమతి ఇస్తుంటే నగరాల్లో అయితే అమ్మాయిలు ఏరికోరి మరీ తమకన్నా చిన్నవాడినే వరించడం కొసమెరుపు. అబ్బాయిలు కూడా ఈ క్రేజీ అమ్మాయిల వెంటే ఆనందంగా నడుస్తున్నారు. సాఫ్ట్‌వేర్ కొలువులు, విదేశాలలో స్థిరపడిన అమ్మాయిలలో ఈ ధోరణి ఎక్కువగా కనబడుతోంది. అన్నీ కుదిరి అమ్మాయి వయసు ఎక్కువగా ఉండడమే ప్రతిబంధకంగా మారితే అబ్బాయి తరపు వాళ్లే ముందుకొచ్చి అదేమంత ఇబ్బంది కాదని వధువు కుటుంబీకులను ఒప్పించడం గమనించాల్సిన అంశం.

భక్తిశ్రద్ధలతో బక్రీదు

ప్రత్యేక ప్రార్థనలతో ఈద్గాలు కిటకిట

నరసరావుపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బక్రీదు పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా శనివారం ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు పెద్దసంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. నరసరావుపేట, వినుకొండ, మాచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, చిలక లూరిపేట పట్టణాల్లో ఈద్గా మైదానాలు ముస్లింలతో కిటకిటలాడాయి. వినుకొండ ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లో జరిగిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.



నరసరావుపేట ఈద్గాలో జరిగిన ప్రార్థనలలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



వినుకొండ ఈద్గాలో జరిగిన ప్రార్థనలలో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మలికార్జునరావు

ఎక్కడి వాళ్లు అక్కడే

- 20 ఏళ్లు దాటినా బదిలీలు లేవు
- లేని రోగాలు చూపెడుతున్న ఎస్టీవోలు
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కోసం నానాపాట్లు
- బదిలీలలో ఖజానా శాఖ నిబంధనలకు నీళ్లు



గుంటూరు సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు సర్వీస్ దాటిన వారిని ఖచ్చితంగా బదిలీ చేయాలని ప్రభుత్వం చెబుతుంది. ఇరవై ఏళ్లు అయినా పర్వాలేదు అంటోంది ఖజానాశాఖ. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల డీటీవోలు ఉద్యోగుల బదిలీ విషయంలో నిబంధనలు పాటించటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం గత నెలలో వెలువరించిన జీవో ప్రకారం ఖజానా శాఖకు చెందిన చాలామంది అధికారులు, సిబ్బందికి స్థానచలనం కలగాలి. కానీ కాసుల వర్షం కురిపించే స్థానాలను వదలకుండా ఉండేందుకు నానాప్రయత్నాలు చేస్తున్నారు. అటువంటి వారికి అధికారులు కూడా వంత పాడుతున్నట్లు తెలుస్తుంది. దీంతో ఒకే స్థానంలో 20 ఏళ్లు.. 15 ఏళ్లు పైబడి సర్వీస్ చేసిన వాళ్లు కూడా బిందాస్‌గా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఉమ్మడి గుంటూరు జిల్లా లోని కొందరు ఎస్టీవో(సబ్ ట్రెజరీ ఆఫీసర్)లు బదిలీ నుంచి తప్పించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలు, డయాలసీస్ చేయించుకునే వారిని బదిలీ నుంచి మినహాయించాలని జీవోలో ఉంది. ఈ మినహాయింపు పొందేందుకు కొందరు ఎస్టీవోలు లేని రోగాలు ఉన్నట్లుగా చూపుతున్నట్లు సమాచారం. జీవోలో లేని రోగాలు కూడా చేర్చి బదిలీకి సున్నం కొడుతున్నారు. ఓ ఎస్టీవో కేవలం ఒక కిడ్నీ అని చూపారు. అయితే జీవో ప్రకారం అటువంటి మినహాయింపు లేకపోయినా బదిలీ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. బదిలీలను తప్పించుకునేందుకు ఐదుగురు ఉద్యోగులు దొంగ సర్టిఫికెట్లు సమర్పించినట్లు తెలుస్తుంది. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరఫున ఆయా పదవుల్లో ఉన్నట్లు సర్టిఫికెట్లు సమర్పించారు. వాస్తవానికి ఆ లేఖలు 2022లో ఇచ్చినవని నాయకులు చెబుతున్నారు. అప్పటి లేఖలు ఇప్పుడు చూపించి బదిలీ ప్రక్రియను తప్పించుకునేందుకు పక్కదారి పట్టించారు.

రెండు దశాబ్దాలు పై మాటే..

గుంటూరు, బాపట్ల జిల్లాలో కొందరు సీనియర్ అకౌంటెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు ఒకే చోట 20 ఏళ్లపై బడి పని చేస్తున్నారు. బాపట్లలో ఓ ఉద్యోగి 20 ఏళ్లు, తెనాలిలో మరో ఉద్యోగి 18 ఏళ్లు, మంగళగిరి, గుంటూరు కార్యాలయాల్లో ఇద్దరు ఉద్యోగులు 15 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. బదిలీల నిబంధనల ప్రకారం వారిని బదిలీ చెయ్యాలి. కానీ ఈ పరిస్థితి ఇక్కడ కనిపించడం లేదు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు బదిలీలు ఉండవు. పల్నాడు ప్రాంతానికి చెందిన ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని గుంటూరుకు బదిలీ చేసేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

ప్రమోషన్‌కు.. ఫాల్స్ లేఖ!

8

- బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో లబ్ధి
- ఉద్యోగ సంఘాల నే(మే)తల చేతివాటం
- సంఘంలో లేకున్నా..ఉన్నట్లు సిఫారస్సు లేఖలు
- ఒక్కో లేఖకు రూ.లక్షల్లో వసూళ్లు

ఇంటర్ అడ్వాన్స్‌లో అరకొరే


ప్రథమ 45, ద్వితీయ సంవత్సరం 63 శాతం ఉత్తీర్ణత

గుంటూరు(విద్య), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ బోర్డు శనివారం విడుదల చేసిన ఫలితాల్లో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల విద్యార్థులు అరకొర ఫలితాలు సాధించారు. మూడు జిల్లాల సగటును పరిశీలిస్తే ప్రథమ సంవత్సరం విద్యార్థులు 45 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 63 శాతం ఉత్తీర్ణత సాధించారు. గుంటూరు జిల్లా నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థులు 5117 మంది పరీక్షకు హాజరుకాగా 2425 మంది(48 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాపట్ల జిల్లా నుంచి 2762 మందికి 1150 మంది(42 శాతం), పల్నాడు జిల్లా నుంచి 4846 మందికి 2049 మంది(42 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో గుంటూరు జిల్లా నుంచి 3202 మంది పరీక్ష హాజరుకాగా 2011 మంది(63 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాపట్ల జిల్లా నుంచి 2098 మందికి 1319 మంది(63 శాతం), పల్నాడు జిల్లా నుంచి 2798 మందికి 1884 మంది(67 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

సారా రహిత జిల్లానే లక్ష్యం

- 28 గ్రామాలకు 24 గ్రామాల్లో నిర్మూలన
- డీపీఈవో మణికంఠ

నరసరావుపేట లీగల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నాటు సారారహిత జిల్లాగా పల్నాడును మార్చడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు డీపీఈవో మణికంఠ తెలిపారు. నరసరావుపేటలోని కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో జిల్లాలోని 28 గ్రామాల్లో నాటు సారాను గుర్తించామన్నారు. ఇప్పటికీ 24 గ్రామాలలో నాటు సారాను పూర్తిగా నిర్మూలించినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాలైన కొత్త పుల్లారెడ్డిగూడెం, మొరనపెంట, హస్నాబాద్ తండా, చేజర్ల తండాలలో త్వరలో మార్పు వస్తుందని భావిస్తున్నామన్నారు. ఈ నాలుగు గ్రామాలలో త్వరలోనే నాటు సారా పూర్తిగా నిర్మూలించి లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. నాటు సారా నిర్మూలన తొలి దశలో భాగంగా 116 అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. రెండో దశలో విస్తృతంగా దాడులు నిర్వహించి సారా తయారీ, విక్రయాల్లో ఉన్న 32 మందిపై కేసులు నమోదు చేసి 21 మందిని అరెస్టు చేశామన్నారు. 138 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నమన్నారు. 11,400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి ఐదు కేసుల్లో నిందితులను గుర్తించి అరెస్టు చేశామన్నారు. నరసరావుపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 9 మంది, మాచర్ల పరిధిలో పదిమంది పాత నేరస్తులను అరెస్టు చేసినట్లు తెలిపారు. 150 మంది నిందితులను, 30 మంది అనుమానితులను గుర్తించి వారిపై నిఘా పెట్టామన్నారు. 111 మంది నిందితులను బైండోవర్ చేశామన్నారు. కొత్త పుల్లారెడ్డిగూడెం, మొరనపెంట చింతలతండాల్లో కార్డెన్‌సెర్చ్ చేశామన్నారు. బెల్లం వ్యాపారులకు నోటీసులు ఇచ్చామన్నారు. నిందితుల వివరాలు ఇచ్చి వారికి బెల్లం అమ్మవద్దని తెలిపామన్నారు. బెల్లం సరఫరా చేసిన ఓ వ్యాపారిని అరెస్టు చేశామన్నారు. ఇప్పటికీ ఆయా ప్రాంతాల్లో నాటు సారా వృత్తిగా ఉన్న వారికి చైతన్యం కల్పించి ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించడానికి 57 మందిని గుర్తించామన్నారు. వారిలో ఆరుగురికి డీఆర్‌డీఏ సహకారంతో రుణాలకు సిఫార్సు చేశామన్నారు. కార్యక్రమంలో ఈఎస్ రవీంద్ర, ఇన్‌స్పెక్టర్ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఈవో కే మణికంఠ



శివాజ్ఞతోనే కన్నప్పని నిర్మించాం

గుంటూరు ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మంచు మోహన్‌బాబు, విష్ణు

8

వీఆర్వోపై అత్యాచారం కేసు

పొన్నూరుటౌన్ జూన్ 7(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్‌గా పని చేస్తున్న మహేష్‌పై అత్యాచారం కేసు నమోదైంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు.. నిడుబ్రోలుకు చెందిన ఓ వివాహిత ఈ నెల 3న అర్బన్ పోలీసులకు వీఆర్వోపై లిఖిత పూర్వక ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి గోప్యంగా దర్యాప్తు చేస్తున్నారు. వీఆర్వో మహేష్ మార్చి 8న తన వద్ద రూ.25 లక్షలు అప్పుగా తీసుకున్నట్లు సదరు మహిళ ఫిర్యాదులో పేర్కొంది. ఏప్రిల్ 6న గుంటూరు వస్తే నగదు ఇస్తానని నమ్మించి.. హోటల్‌కు తీసుకు వెళ్లి అత్యాచారం చేసినట్లు తెలిపింది. అంతే కాకుండా వీడియో తీసి, దానిని బహిర్గతం చేస్తానని బెదిరించి మరో రూ.2 లక్షలు వసూలు చేశాడని పేర్కొంది. వీఆర్వో వల్ల తనకు ప్రాణహాని ఉందని తెలిపింది. అయితే కేసు నమోదు చేసినట్లు తెలుసుకున్న వీఆర్వో నాలుగు రోజులుగా విధులకు హాజరు కాకుండా..పరారీలో ఉన్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో రైతు కూలీ మృతి

పొన్నూరుటౌన్, (చేబ్రోలు) జూన్ 7(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు కూలీ మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. చేబ్రోలు కొత్తరెడ్డిపాలెం చెన్నారెడ్డి కాలనీకి చెందిన రైతు కూలీ కారుమూరి ధనంబాబు(80) శనివారం ఇంటి వద్ద మోటార్ స్విచ్ ఆన్ చేశాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నారు.

పురుగు మందు తాగి ఆత్మహత్య

బాపట్లరూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. బాపట్ల రూరల్ ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల మండలం కొండుబొట్లవారిపాలెం గ్రామానికి చెందిన నామన ఆదినారాయణ (74) కుటుంబ గొడవల నేపథ్యంలో పురుగు మందు తాగి, మృతి చెందాడు. మృతుడి కుమారుడు శేషగిరి ఫిర్యాదు మేరకు.. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న అనంత నగేష్ బాబు

కాలుష్యంతో శూన్యంలో జల సంపద

జాతీయ మత్స్యకార సంఘం సెక్రటరి జనరల్ అనంత నగేష్‌బాబు

బాపట్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : సముద్ర తీరంలో నానాటికి కాలుష్యం విపరీతంగా పెరిగి పోవడం వల్ల జల సంపద శూన్యమయ్యే ప్రమాదం ఉందని జాతీయ మత్స్యకార సంఘం ఆలిండియా సెక్రటరి జనరల్ అనంత నగేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం మత్స్యకార సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దివిస్ ఫార్మాసూటికల్స్ ఐదు పైపులైన్‌లు సముద్రం లోపలికి వేయడం వల్ల మత్స్యకారులు రోడ్డు పాలవుతున్నారని చెప్పారు. భూగర్భ జలాలు విషపూరితంగా మారి మత్స్యకారులు రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. దివిస్, అరబిందో, హెటిరో, డెక్కన్ మొదలగు ఫార్మా కంపెనీలు సముద్ర తీరం వెంట ఉండి, వ్యర్థాలను పైపుల ద్వారా సముద్రంలోకి వదలడం వల్ల మత్స్యసంపద తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కంపెనీలపైన అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే జాతీయ మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మోసా అప్పలరాజు, గొల్ల ఏకాక్షరి, ఓరుకుల జయశంకర్, మారం రవికుమార్, మైలి జగ్గారావు పాల్గొన్నారు.

జీజీహెచ్ నుంచి రిమాండ్ ఖైదీ పరార్

ఇటీవల హత్య కేసులో అరెస్టయిన నిందితుడు నాగుల్‌మీరా

గుంటూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జీజీహెచ్ నుంచి రిమాండ్ ఖైదీ పరారయ్యాడు. నలుగురు ఎస్కార్ట్ పోలీసుల కళ్ళుగప్పి నిందితుడు నాగుల్ మీరా పరారయ్యాడు. ఇటీవల చేబ్రోలు పరిధిలోని సుద్దపల్లిలో జరిగిన గోపీ హత్య కేసులో నాగుల్‌మీరా నిందితుడిగా ఉన్నాడు. తన భార్యతో గోపీ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే కారణంతో నాగుల్ మీరా ఈ హత్యకు పాల్పడ్డాడు. ఆ కేసులో నిందితుడైన నాగుల్ మీరాను చేబ్రోలు పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో జీజీహెచ్‌కు తరలించారు. అనారోగ్య కారణంతో నాగుల్‌మీరాను వైద్య పరీక్షల కోసం శనివారం ఉదయం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో వైద్య పరీక్షలకు తీసుకువెళుతుండగా ఎస్కార్ట్ పోలీసుల కళ్ళుగప్పి పరారయ్యాడు. నాగుల్‌మీరాతో పాటు మరో రిమాండ్ ఖైదీని కూడా వైద్య పరీక్షలకు జీజీహెచ్‌కు తీసుకువచ్చారు. వీరికి హెడ్ కానిస్టేబుల్ ఎం డేవిడ్ రాజుతో పాటు మరో ముగ్గురు కానిస్టేబుళ్ళను ఎస్కార్ట్‌గా నియమించారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన నలుగురు పోలీస్ సిబ్బందిని సస్పెండ్ చేసే అవకాశం ఉంది. ఖైదీ పరారీపై కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నోడైనా.. చేసేసుకుంటాం

(5వ పేజీ తరువాయి)

ఒప్పించి పెళ్లి చేసుకుంటోంది.

వయసు పట్టింపు లేదు..

పెళ్లిళ్ల పేరయ్యలు మొదలు, మ్యాట్రిమోని సైట్ల వరకు గతంలో అబ్బాయి వయసు ఎక్కువగా ఉండాలనేది దాదాపు ఓ అధికారిక నిబంధనగా ఉండేది. అమ్మాయి వయసు అబ్బాయి కన్నా తక్కువగా ఉండడం తప్పనిసరి. అలాంటి సంబంధాలే తల్లిదండ్రుల వద్దకు వెళ్లేవి. కానీ గడచిన దశాబ్ద కాలంగా ఈ తీరులో కొంత మార్పు రాగా ఇటీవల కొన్ని మ్యాట్రిమోని సైట్లలో వయసు విషయంలో నాలుగు నుంచి ఐదేళ్ల వరకు తమకు ఇబ్బందేమి లేదని అమ్మాయిలు, అబ్బాయిలూ ఇద్దరూ ఆప్షన్ ఇస్తున్నారు. ఉమ్మడి గుంటూరుతో పాటు బాపట్ల జిల్లాలో కూడా చాలా వరకు గ్రామీణ నేపథ్యమే ఎక్కువ. దశాబ్దం క్రితం వరకు వయసులో అబ్బాయి కన్నా అమ్మాయి వయసు ఎక్కువగా ఉండే పెళ్లిళ్లకు పెద్దలు అంగీకరించేవారు కాదు. గుట్టుచప్పుడు కాకుండా జరిగే ప్రేమ వివాహాల్లోనే వయసు ఎక్కువ విషయాన్ని గోప్యంగా ఉంచేవారు. అయితే ప్రస్తుతం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన వివాహాల్లో అమ్మాయి వయసు అబ్బాయి కన్నా కనీసం రెండేళ్లు ఎక్కువగా ఉండడం గమనార్హం. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నమోదయ్యే వివాహాలను పరిశీలించినా నెలకు ఐదు నుంచి పది వరకు అమ్మాయి వయసు అబ్బాయి కన్నా ఒకటి నుంచి మూడేళ్ల వరకు ఎక్కువగా ఉంటుందని అధికారిక గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఇవి కూడా ఎక్కువగా గ్రామాల్లో పుట్టి పెరిగిన వారే కావడం గమనార్హం. వరుడు కన్నా వధువు వయసు ఎక్కువగా ఉండే వివాహాలు ప్రేమల్లోనే కాకుండా పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లలో కూడా చాలా సహజమై పోయాయి.

శాస్త్రీయ ఆలోచనలే సంప్రదాయంగా..

సహజంగా ఆలోచనల్లో పరిపక్వత విషయంలో అబ్బాయి కన్నా అమ్మాయి దాదాపు ఐదేళ్లు ముందుగానే ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. దీంతో వివాహం అనంతరం సమస్యలు తలెత్తకుండా ముందుచూపుతో వయసు అంతరం పెట్టి శాస్త్రీయ నిరూపణనే సంప్రదాయంగా స్థిరపరచారని అభ్యుదయవాదులు చెబుతుండగా, వరుడు వధువు కంటే పెద్దవాడై ఉండాలని లేకపోతే పురుషుడికి ఆయుక్షీణమని ధర్మశాస్త్రాలలో ఎప్పుడో చెప్పారని పండితులు వాదిస్తున్నారు.

సుమోటోగా అరెస్టు చేయాలి

● మాజీ ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి

గుంటూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం భూములిచ్చిన మహిళలపై సాక్షి టీవీలో విశ్లేషకుడిగా చెప్పుకునే కృష్ణంరాజు ఘోరమైన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకొని అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి డిమాండ్ చేశారు. వెంటనే ఆయన బేషరతుగా మహిళలకు క్షమాపణ చెప్పాలని కోరారు. ఇది మహిళా లోకానికే అవమానమని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక మంత్రి రాజధానిని శ్మశానం అన్నారని గుర్తుచేశారు. తక్షణమే అతన్ని అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటువంటివి ప్రోత్సహిస్తోన్న సాక్షిని వెంటనే బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

గుంటూరు(తూర్పు), జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఏపీలో కొత్తగా ప్రారంభించబోతున్న పది మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు- ప్రైవేటీకరణ అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రజారోగ్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.రమణయ్య మాట్లాడుతూ కళాశాలలను ప్రభుత్వమే నడపాలని కోరారు. తోటి తెలంగాణ రాష్ట్రం నడుపుతున్నప్పుడు... ఏపీ ప్రభుత్వం ఆ సేవలను అందించలేమని చెప్పడం బాధ్యతా రాహిత్యమని పేర్కొన్నారు. రాష్ట్ర మెడికల్ విద్యార్థులు, తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ అలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటనను స్వాగతిస్తున్నామని... అదే సమయంలో పీపీపీ పద్ధతిలో ఏర్పాటు చేస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి కామేశ్వరరావు మాట్లాడుతూ జీఓ నంబర్లు 107, 108 రద్దు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం వాటిని కొనసాగించడం దారుణమని అన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకుడు వేణుగోపాలరావు మాట్లాడుతూ నూతన విధానంలో ప్రభుత్వ వైద్య కళాశాలలతో పాటు జిల్లా కేంద్రాల్లో ఉండే ప్రభుత్వ, ప్రాంతీయ ఆస్పత్రులు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలన్నీ దశలవారిగా ప్రైవేటు సంస్థలకి కట్టబెడతారని పేర్కొన్నారు. ప్రజారోగ్య వేదిక నగర కార్యదర్శి జి.శ్రీనివాసరావు ఈ విధానం అమలైతే వైద్య కళాశాలల్లో ఫీజులు పెరుగుతాయని, పేద విద్యార్థులు డాక్టర్లయ్యే అవకాశం తగ్గుతుందని అన్నారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు, మేధావులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు, మాట్లాడుతున్న అలా వెంకటేశ్వర్లు

అమరావతిపై విష ప్రచారం చేస్తే మహిళలే బుద్ధి చెబుతారు

- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల రాజధాని అమరావతిని వేశ్య రాజధాని అని.. జగన్ మీడియాలో ఓ పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడించడం సిగ్గు చేటని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక మహిళ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆ పత్రిక అవినీతితో పుట్టిందని, మొన్న జరిగిన ఎన్నికల్లో మహిళల చేతిలో చావుదెబ్బ తిన్నా ఇంకా ఆ పార్టీ నేతలకు, ఆ పత్రికకు బుద్ధి రాలేదన్నారు. సంస్కారం లేని రాతలు ఇకనైనా మానుకోకుంటే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని యరపతినేని పేర్కొన్నారు.

జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జగన్ తక్షణమే సాక్షి టీవీ ఘటనపై రాష్ట్ర మహిళలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజధాని మహిళలను కించపరిచిన సాక్షి చానల్‌కు, ఆ టీవీ సిబ్బందికి, దాని సృష్టికర్త జగన్‌కు రాష్ట్ర మహిళలు తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. మరోమారు ఏ మహిళ గురించి అయినా చులకనగా మాట్లాడాలంటే భయపడేలా శాస్తి చేయాలని కోరారు. సాక్షి ఛానల్, పత్రిక పుట్టుక నుంచి తగిన విచారణ జరిపి, పత్రికా స్వేచ్ఛ ముసుగులో అడ్డగోలుగా చేస్తున్న దుష్ప్రచారంపై లోతుగా విశ్లేషించాల్సిన బాధ్యత ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు.

గూడ్స్ రైలు ఢీకొని యువకుడి మృతి

నరసరావుపేట లీగల్, జూన్ 7, (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొని పట్టణానికి చెందిన ఈశ్వరి వీరాంజనేయరెడ్డి (38) అనే యువకుడు మృతి చెందిన ఘటన శనివారం మధ్యాహ్నం శంకరమఠం వద్ద చోటుచేసుకుంది. నరసరావుపేట రైల్వే ఇన్‌చార్జి ఎస్సై గితిక వివరాల మేరకు.. వీరాంజనేయరెడ్డి శంకర మఠం సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా.. గుంటూరు నుండి నరసరావుపేట వైపు వచ్చే గూడ్స్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, ఆధార్ కార్డు ఆధారంగా సదరు విషయాన్ని మృతుడి తల్లిదండ్రులకు తెలిపారు. మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలోని శవాగారానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఐదు ఎకరాల గడ్డివామి దగ్ధం

- రూ.2లక్షల ఆస్తినష్టం

బాపట్లరూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): భర్తీపూడిలో ఐదు ఎకరాల గడ్డివామి శనివారం అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన రైతు దేవరకొండ శ్రీనివాసరావు గడ్డివామికి ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రైతుకు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది.

నిర్మాణ భవనం పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

తాడేపల్లి (వడ్డేశ్వరం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద నిర్మాణంలో ఉన్న భవనంపై నుండి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం జరిగింది. తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్ కథనం మేరకు.. డీజీపీ కార్యాలయ సమీపంలో ఓ హోటల్ పక్కన నిర్మాణం జరుగుతున్న భవనం 5వ అంతస్తు నుండి వ్యక్తి దూకి మృతి చెందాడన్న సమాచారంతో సీఐ కల్యాణ రాజు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు గుంటూరు విద్యానగర్‌కు చెందిన గండు జగదీష్ (35)గా గుర్తించారు. మృతుడి సోదరుడు సునిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

పుష్కర ఘాట్ వద్ద ఉరేసుకుని వ్యక్తి ...

తాడేపల్లి టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం పుష్కర ఘాట్ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక శివాలయం వీధి ఎదురుగా ఉన్న ఘాట్‌లో ఉన్న చెట్టుకు ఓ వ్యక్తి వేలాడుతూ. ఉన్నాడని స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ జె.శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. లుంగి, కండువాలను ముడివేసి చెట్టుకు ఉరేసుకున్నట్టు గుర్తించామని, మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని ఎస్ఐ తెలిపారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉండొచ్చని, ఒంటిపై నలుపు రంగు ప్యాంట్, పింక్ కలర్ చొక్కా ఉన్నాయని, ఎవరికైనా సమాచారం తెలిస్తే తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రాజకీయ విద్రోహశక్తి పిన్నెల్లి

- మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి

మాచర్లటౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాజకీయ విద్రోహ శక్తి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. శనివారం వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో ఇటీవల ప్రత్యర్థుల చేతిలో హతులైన టీడీపీ సీనియర్ నాయకులు జెవిశెట్టి వెంకటేశ్వర్లు, అతని సోదరుడు కోటేశ్వరరావు దశదిన కర్మ సంతాప సభలో ఎమ్మెల్యే జూలకంటి పాల్గొన్నారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జంట హత్యల కేసులో ఎంతటి వారున్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. పచ్చని పల్లెల్లో పిన్నెల్లి సోదరులు కాలుష్యాన్ని సృష్టించి విష బీజాలను నాటుతున్నారని జూలకంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు, దౌర్జన్యాలతో నియోజకవర్గాన్ని భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తే ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. కుహనా ఫ్యాక్షన్ శక్తులు వెన్నులో వణుకు పుట్టించేలా కూటమి ప్రభుత్వం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సంఘ విద్రోహ శక్తులను చట్టం ప్రకారం శిక్షిస్తామన్నారు. జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కోవర్టు రాజకీయాలు మానుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకుంటారని పిన్నెల్లి సోదరులను ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి హెచ్చరించారు. అభివృద్ధిలో వెనుకబడిన మాచర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచేందుకు పనిచేస్తుంటే పిన్నెల్లి సోదరులు రాజకీయపబ్బం కోసం నీచ రాజకీయాలకు తెరతీస్తున్నారని మండిపడ్డారు. నాయకులు పాల్గొన్నారు.



జెవిశెట్టి సోదరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

సాగర్ సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 511.60 అడుగులు ఉంది. ఇది 134.40 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 900 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 900 క్యూసెక్కుల నీరు దిగువకు చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 21.35 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

నేడు డీఈవో కార్యాలయం ముట్టడి

సత్తెనపల్లి జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఎస్టీటీలకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ జరపాలని వెబ్‌కౌన్సెలింగ్ రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 8వ తేదీ సత్తెనపల్లి ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు ఉపాధ్యాయ నాయకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఎంఈఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్ఎం సుభాని, చిన్నం శ్రీనివాసరావు, శివారెడ్డి, రహమాన్, విష్ణు, సుబ్బు, సురేష్ తదితరులున్నారు.

అర్థిక ఇబ్బందుల వల్లే గుత్తా ఆత్మహత్యాయత్నం

● టీడీపీ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

రాజుపాలెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమలిపురి గ్రామానికి చెందిన గుత్తా లక్ష్మీనారాయణ ఆత్మహత్యాయత్నానికి కారణం వ్యక్తిగత, అర్థిక ఇబ్బందులే తప్ప మరొకటి కాదని టీడీపీ మండల నాయకులు పేర్కొన్నారు. పోలీసుల వేధింపుల కారణంగా తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానంటూ లక్ష్మీనారాయణ సోషల్ మీడియాలో వీడియో రిలీజ్‌చేసి ఈ నెల 6న తెల్లవారుజామున ఆత్మహత్యాయత్నానికి పాల్పడి గుంటూరు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న విషయం పాఠకులకు విదితమే. దీనిపై శనివారం టీడీపీ రాజుపాలెం మండల నాయకులు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ లక్ష్మీనారాయణ శ్రీకాకుళం, ఉభయ గోదావరి జిల్లాలో ఎక్కువగా ఉండి వ్యాపారం చేసేవాడని చెప్పారు. ఏం జరిగిందో తెలుసుకోకుండా వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, సత్తెనపల్లి వైసీపీ నాయకుడు గజ్జల భార్గవ్‌రెడ్డి టీడీపీ, సత్తెనపల్లి పోలీసుల వలన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని బురదజల్లే ప్రయత్నం చేయటం మానుకోవాలి హితవు పలికారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, అంచుల నరసింహారావు, నల్లమోతుల శ్రీనివాసరావు, సానికొమ్ము కోట్టిరెడ్డి, సర్పంచ్ కణదం శ్రీను, పులిబండ్ల సాంబశివరావు, పెద్దింటి శ్రీను, గుడారి గంగరావు, గుమ్మ పుల్లయ్య, తోట వెంకటశివ, పగడాల శ్రీను తదితరులు ఉన్నారు.

నేడు యోగాంధ్రకు కలెక్టర్ రాక

పిడుగురాళ్ల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం ఉదయం 6 గంటలకు సీనియర్ సిటిజన్‌లతో యోగాంధ్ర కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు హాజరుకానున్నారని కమిషనర్ పి శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అందరూ యోగా కార్యక్రమానికి హాజరుకావాలని కమిషనర్ కోరారు.

బ్రాహ్మణ సంఘాల ఆగ్రహం

దాచేపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కన్నప్ప సినిమాతో బ్రాహ్మణులను వ్యక్తిగతంగా కించపరుస్తూ తీసిన చిత్రంపై చర్యలు తీసుకోవాలని, చిత్ర నిర్మాతలను చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ దాచేపల్లి బ్రాహ్మణ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. శనివారం సంఘ సభ్యులు మాట్లాడుతూ ఓ వ్యక్తిని, ఓ కులాన్ని, వ్యవస్థ మనోభావాలు దెబ్బతీసే హక్కు ఎవ్వరికీ లేదని మండిపడ్డారు. ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో బ్రాహ్మణ సంఘాలు, ప్రజా సంఘాలు కలసి తమ నిరసనను ఉధృతం చేస్తామని బ్రాహ్మణ సంఘాల నేతలు తంగెడ నాగేశ్వరరావు, జానపాటి సీతారామశాస్త్రి, తంగెడ వీరేశ్వరరావు, తిరుమలాచార్యులు, దుగ్గరాజు కేశవరావు, అక్కిరాజు మల్లిఖార్జునరావు తదితరులు హెచ్చరించారు.


మండల విద్యా వనరుల కేంద్రానికి చేరిన పాఠ్య పుస్తకాలు

పాఠ్య పుస్తకాలు సిద్ధం

సత్తెనపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు 46,851 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా 46,503 పాఠ్య పుస్తకాలు మండల విద్యావనరుల కేంద్రానికి చేరాయని ఎంఈవో శ్రీనివాసరావు శనివారం తెలిపారు. అన్ని పాఠశాలలకు పుస్తకాలు పంపిణీచేస్తున్నామన్నారు.

10న పల్నాడు జిల్లా సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

సత్తెనపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ మెన్ అండ్ ఉమెన్ జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక సుగాలీకాలనీ హైస్కూల్‌లో జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు కే సుబ్రహ్మణ్యేశ్వరరావు శనివారం విలేకరులకు తెలిపారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు వారి పుట్టినతేదీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు ఒరిజినల్, జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకొని రావాలన్నారు. పూర్తి వివరాలకు 73969 67776 నెంబరులో సంప్రదించాలన్నారు.

కొలతల మేరకు కూలీలు పనులు చేయాలి

ముప్పాళ్ళ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కూలీలు అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే రూ.307 వరకు కూలి చెల్లించ బడుతుందని ఏపీఓ ఏడుకొండలు అన్నారు. మండలలోని అన్ని గ్రామాలలో ఉపాధిహామీ పనులు జరుగుతున్నాయని శనివారం ఏపీఓ తెలిపారు.

నేడు సత్రశాలలో కృష్ణవేణి విగ్రహావిష్కరణ

రెంటచింతల, జూన్ 7(ఆంధ్రజ్యోతి):: పల్నాట ప్రముఖ శైవక్షేత్రం కృష్ణానది ఒడ్డునగల మెట్ల మార్గంలో ఆదివారం కృష్ణవేణి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు కార్తీకమాస అన్నదానం కమిటీ సభ్యులు చెప్పారు. ఈ విగ్రహాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆవిష్కరిస్తారని చెప్పారు.

వేయి వెన్నుపోటుల సమాహారం జగన్

● ద్రోహులతో నిండిన పార్టీ వైసీపీ
● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వేయి వెన్నుపోటులకు సమాహారం ఎమ్మెల్యే జగన్‌రెడ్డి అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు. శనివారం వెల్దుర్తిలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు వెన్నుపోటు పొడిచి సిగ్గులేకుండా వెన్నుపోటు దినం అని కార్యక్రమాలు చేయడం సిగ్గు చేటన్నారు. పినతండ్రికి, కన్నతల్లికి, తోడబుట్టిన చెల్లెలికి వెన్నుపోటు పొడిచిన పరమ దుర్మార్గుడు జగన్‌రెడ్డి అని విమర్శించారు. బడుగు, బలహీన, అణగారిన వర్గాలను సామాజికంగా, ఆర్థికంగా వెన్నువిరిచి ఐదేళ్ల నరకం చూపించాడని ఆరోపించారు. మైన్, వైన్, ల్యాండ్, శాండ్ కుంభకోణాల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వెన్నువిరిచి లక్షల కోట్లు దోచుకుంది వైసీపీవారు కాదా అని ప్రశ్నించారు. చదువుకున్న యువత ఆశలపై నీళ్లు చల్లి వారి బంగారు భవిష్త్‌ను అంధకారంలో పడేశారని నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి వారిని సామాజికంగా దెబ్బతీశారని విమర్శించారు. దుల్హన్ పథకాన్ని రద్దు చేసి ముస్లింలను నిలువునా మోసం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలను అన్నివిధాలుగా మోసం చేసి నేడు వెన్నుపోటు దినం అంటూ రోడ్డెక్కడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అందుకే ప్రజలు జగన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా బుద్ధి చెప్పారన్నారు. ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల మన్ననలను పొందుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో నిబద్ధతతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతున్నారన్నారు.

ఫ్యాక్షనిస్టులు.. రౌడీషీటర్లే మిత్రులు..

గంజాయి మామ జగన్‌రెడ్డికి ఫ్యాక్షనిస్టులు, రౌడీషీటర్లే మిత్రులని ఎమ్మెల్యే జూలకంటి ఎద్దేవా చేశారు. తెనాలిలో గంజాయి బ్యాచ్ పోలీసులపై దాడిచేసి హల్‌చల్ సృష్టిస్తే వారికి మద్దతునిచ్చి పరామర్శకు వెళ్లడం విడ్డూరమన్నారు. దందాలు, దౌర్జన్యాలు, దాడులు చేసేవారికి వైసీపీలో జగన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. అందుకే ఏపీలో సైకోలను సాగనంపి ప్రజాస్వామ్యానికి ప్రజలు పట్టంగట్టారని అన్నారు. సమావేశంలో పంగులూరి పుల్లయ్య, చప్పిడి రాము, కంభంపాటి అనిల్, వజ్రంనాయక్, బాబుఖాన్, మంజుల పెద అంజి, ఎస్‌కే మోసిన్, జాని, బాబు, బెల్లంకొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్


దుర్గిలో నమాజు చేస్తున్న ముస్లింలు

మాచర్లటౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగం, ప్రేమ, కరుణ, మతసామరస్యానికి నిదర్శనం బక్రీద్ అని, బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఆనందంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. హజ్రత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా ఈ పండుగ జరుపుకుంటారన్నారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లింలు నమాజ్‌లో పాల్గొన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రెంటచింతలలో..

రెంటచింతల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను ముస్లింలు శనివారం మండలంలోని మసీదుల్లో ఘనంగా జరుపుకున్నారు. ఉన్నదాంట్లో ఎంతోకొంత దానం చేయడం గొప్ప లక్షణమని మత పెద్దలు ఉద్బోధించారు. ప్రతి ఒక్కరూ మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మత పెద్దలైన షఫీ, ఇలియాస్, ఇంతియాజ్, మహ్మద్ ఖాసిమ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గిలో..

దుర్గి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతిరూపమే బక్రీద్ పండుగ అని ఇస్లాం మత ప్రవక్త బోధించారు. మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్‌ను జరుపుకున్నారు. ఈద్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. దుర్గిలో అధిక సంఖ్యలో ముస్లింలు ఈద్గాకు చేరుకొని నమాజ్ జరిపారు.

గురజాల టౌన్..

గురజాలటౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణ, మండల పరిధిలో ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలో సామూహిక ప్రార్థనలు జరిపారు. మర్కస్ మసీద్ నుంచి ఊరేగింపుగా లక్ష్మీ టాకీస్ సెంటర్లో ఈద్గాకు చేరుకున్నారు. ముఫ్తీ యూనస్ ధార్మిక ఉపన్యాయం చేస్తూ బక్రీద్ పండుగలోని ఆధ్యాత్మిక విషయాలను వివరించారు. సీఐ భాస్కర్, ఎస్ఐలు వినోద్‌కుమార్, అనంతకృష్ణ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


మాచర్ల పట్టణంలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగాలకు గుర్తుగా చేసుకునే పండుగ బక్రీద్ అని పలువురు ముస్లింలు తెలిపారు. బక్రీద్‌ను పురస్కరించుకొని యరపతినేని నగర్‌లోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. జానపాడు రోడ్డులోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ శుభాకాంక్షలు తెలిపారు.

మాచవరంలో...

మాచవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం బక్రీదు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లింలు తెల్లవారుజామున ఆయా గ్రామాల మసీదుల్లో ప్రార్థనలు చేసి మధ్యాహ్నం ఈద్గాల వద ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. మండల గ్రామాల్లో ముస్లింలు బక్రీదు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీదు ప్రార్థనలు


క్రోసూరులో బక్రీదు ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

బెల్లంకొండ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ముస్లింలు బక్రీదు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెల్లంకొండ ఈద్గాల వద్ద ముస్లింలందరూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని వన్నాయపాలెం, పాపాయపాలెం, న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ తదితర గ్రామాల్లో బక్రీదు వేడుకలను ముస్లింలు వైభవంగా నిర్వహించారు.

క్రోసూరులో..

క్రోసూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలంలో బక్రీదు పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పక్కన ఉన్న ఈద్గా మైదానంలో వందలాది మంది ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక బక్రీదు అన్నారు. మండలంలోని దొడ్లేరులో కూడా పెద్ద ఎత్తున ముస్లింలు బక్రీదు ప్రార్థనల్లో పాల్గొన్నారు. హసానాబాద్, ఊటుకూరు, పీసపాడు, 88 తాళ్ళూరు గ్రామాల్లో ఈద్గా మైదానాల వద్ద ప్రార్థనలు జరిగాయి.

అమరావతిలో..

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి):: బక్రీద్ పర్వదినాన్ని మండల పరిధిలోని పలు గ్రామాలలో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్‌ను జరుపుకున్నారు. ఉదయాన్నే ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అమరావతి, లేమల్లె తదితర గ్రామాలలో అధిక సంఖ్యలో ముస్లింలు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అచ్చంపేటలో శనివారం ఈద్గా వద్ద ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. వందలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు ఒకరికొకరు తెలుపుకున్నారు. అల్లా దయతో అందరూ క్షేమంగా ఉండాలంటూ కోరుకున్నట్టు ముస్లింలు తెలిపారు.

పెదకూరపాడులో..

పెదకూరపాడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు మండలంలో ముస్లింలు బక్రీదు పండుగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే పెదకూరపాడులో వీధుల్లో ర్యాలీ చేసుకుంటూ ఈద్గా వద్దకు వెళ్ళి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బక్రీదు పండుగను ఉద్దేశించి త్యాగానికి నిదర్శనం ప్రేమ, సహనం కలిగి ఉండాలని మత బోధకులు వివరించారు. మండలంలోని లగడపాడు, పాటిబండ్ల, 75 తాళ్ళూరు, పరస, తమ్మవరం, చినమక్కెన, గారపాడు గ్రామాల్లో బక్రీదు పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బక్రీదు పర్వదినాన్ని పట్టణంలోని ముస్లింలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మాచర్ల రోడ్డులోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

● సత్తెనపల్లి రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బక్రీదు పండుగను మండలంలోని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే మసీదుల్లో, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానాలు చేశారు.

నకరికల్లులో..

నకరికల్లు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : బక్రీదు త్యాగానికి ప్రతీక అని ముస్లిం పెద్దలు బోధించారు. మండల గ్రామాల్లో బక్రీదును జరుపుకున్నారు. ఈద్గా మైదానాల్లో ప్రార్థనలు చేశారు.

సాక్షి మీడియాపై విరుచుకుపడ్డ మహిళా నేతలు


పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావుకు ఫిర్యాదు చేసిన తెలుగు మహిళలు

సత్తెనపల్లి జూన్ 7(ఆంధ్రజ్యోతి): సాక్షి చానెల్‌ను అడ్డం పెట్టుకుని రాష్ట్రం, అమరావతి మహిళలపై విషం చిమ్ముతున్నారని టీడీపీ మహిళా నేతలు అన్నారు. శనివారం టీడీపీ ప్రజా వేదికలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాటాడుతూ మహిళా ద్రోహులను జగన్ మీడియా పెంచి పోషిస్తుందన్నారు. అమరావతి మహిళలను వేశ్యలుగా సాక్షి మీడియా డిబేట్‌లో కృష్ణంరాజు మాట్లాడటం, దానికి కొమ్మినేని శ్రీనివాసరావు వంతపాడటం అత్యంత సిగ్గుచేటన్నారు. జగన్ భార్య భారతీరెడ్డి కూడా అమరావతి ప్రాంతంలోనే నివాసం ఉంటున్నట్లు సాక్షి మీడియా మర్చిపోయినట్లుందన్నారు. కృష్ణంరాజును ప్రభుత్వం బహిరంగంగా శిక్షించాలన్నారు. మహిళలను సభ్యసమాజం తలదించుకునేలా డిబేట్ నడుస్తున్న సాక్షి మీడియాను మూసివేయించాలన్నారు. రాజధానిపై జగన్, పేటీఎం బ్యాచ్ విషం చిమ్ముతుందన్నారు. మహిళల ఉసురు తగిలి వైసీపీ 11 సీట్లకే పరిమితమైందన్నారు. మహిళా కమిషన్ ఈ అంశంపై తక్షణమే స్పందించి మహిళలపై దారుణ వ్యాఖ్యలు చేసినవారిని శిక్షించేలా చొరవ తీసుకోవాలన్నారు. సాక్షిమీడియాలో వచ్చిన కథనాలపై విచారణ జరిపించి ద్రోహులను శిక్షించాలని వారు కోరారు. రాజధాని మహిళలను సాక్షి డిబేట్‌లో కించపరిచిన కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగు మహిళలు శనివారం రాత్రి పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఆయా కార్యక్రమాలలో టీడీపీ రాష్ట్ర నాయకురాలు మన్నవ శారదాదేవి, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కోమటినేని శోభారాణి, గొర్రెపాటి సుశీల, కొరారు సంధ్య, తోట అంబిక, అండాళ్ళు, కందిమళ్ళ పూజల వెంకట కోటయ్య, వక్కంటి అజయ్ తదితరులున్నారు.

మహిళలను అవమానిస్తే పుట్టగతులుండవు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి, అమరావతి పరిరక్షణ సమితి జేఏసీ కన్వీనర్ నరిచేటి వేణుగోపాల్

సత్తెనపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మహిళలను అవమానిస్తే వైసీపీకి పుట్టగతులు ఉండవని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి, న్యాయవాది, అమరావతి పరిరక్షణ సమితి జేఏసీ కన్వీనర్ నరిచేటి వేణుగోపాల్‌లు వేర్వేరు ప్రకటకల్లో పేర్కొన్నారు. మహిళల ఆత్మగౌరవం దెబ్బతీసేలా అమరావతి దేవతల రాజధాని కాదని, వేశ్యల రాజధాని అని, మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, డిబేట్ నడిపిన కే శ్రీనివాసరావులపై చట్ట పరంగా కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. ఏపీ మహిళా కమిషన్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని సుమోటోగా కేసును నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలన్నారు. మహిళా ఉద్యమ కారులను కించపరిచే వ్యాఖ్యలు చేసేవారిని చట్టపరంగా శిక్షించాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి ప్రహరీ, మీటింగ్ హాల్ నిర్మించాలి

నకరికల్లు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నకరికల్లు తహసీల్దార్ కార్యాలయానికి ప్రహరీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే సమావేశాలు నిర్వహించుకొనేందుకు ఎలాంటి భవనం అందుబాటులో లేదు. అందుకోసం మీటింగ్ హాల్ నిర్మాణాన్ని చేపట్టాలని రెవెన్యూ సిబ్బంది, మండల ప్రజలు కోరుతున్నారు. ఊరికి దూరంగా ఉండటమే కాక చుట్టూ ఎలాంటి రక్షణ లేక పోవటం తహసీల్దార్ కార్యాలయంలో జంతువులు ప్రవేశిస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనులపై వచ్చేవారు కార్యాలయ ఆవరణలో ఉన్న ఒక బల్ల మీద, చెట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి ఉంది. ప్రహరీ లేని కారణంగా తహసీల్దార్ కార్యాలయ పరిసరాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. నివాసాలను ఏర్పాటుచేసుకొని కొంత మంది నివసిస్తుండగా మరికొందరు వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి తహసీల్దార్ కార్యాలయంలో మీటింగ్ హాల్, ప్రహరీ నిర్మించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల కమిటీలను వేగవంతం చేయాలి

పెదకూరపాడు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నూతన కమిటీలను వేగవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ అన్నారు. పెదకూరపాడులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణలకు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రతినిధులు కంచర్ల జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌తో 22 ఏళ్ల పాటు ఉచిత విద్యుత్

● ఏపీ ట్రాన్స్‌కో ఈఈ నూతలపాటి సింగయ్య


విద్యుత్ లైన్‌ను పరిశీలిస్తున్న ఏపీ ట్రాన్స్‌కో ఈఈ సింగయ్య

రెంటచింతల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకాన్ని ఉపయోగించుకుంటే 22 సంవత్సరాల పాటు ఉచిత విద్యుత్‌ను పొందే అవకాశం ఉందని మరో రెండేళ్ల పాటు సబ్సిడీ పథకం అమలులో వుంటుందని ఏపీ ట్రాన్స్‌కో ఈఈ నూతలపాటి సింగయ్య చెప్పారు.పాలువాయి గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేస్తున్న విద్యుత్ లైన్లను శనివారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 3 కిలోవాట్ సామర్థ్యం గల సోలర్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే రూ.2.10 లక్షలు ఖర్చవుతుందని, ఏ బ్యాంక్ నుంచైనా అప్పు తీసుకోవచ్చని, అందులో రూ.78వేలు సబ్సిడీ వుంటుందని తెలిపారు. తీసుకున్న రుణం మూడు సంవత్సరాల్లో తీరిపోతుందన్నారు. ఒక కిలోవాట్‌కు సబ్సిడీ రూ.30 వేలు,రెండు కిలోవాట్లకు సబ్సిడీ రూ.60 వేలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ పథకం 2027 సంవత్సరంతో ముగుస్తుందని, వినియోగదారులు విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడానికి ముందుకురావాలని కోరారు. మాచర్ల విద్యుత్ డివిజన్ పరిధిలో ఉన్న 11 మండలాల్లో ఇప్పటివరకు 321 మంది ఈ పథకాన్ని వాడుకుంటున్నారని, ప్రతి నెలా 8 వేల యూనిట్ల విద్యుత్ ఆయా కుటుంబాల నుంచి గ్రిడ్‌కు చేరుతుందన్నారు. విద్యుత్ సర్వీస్ లోడ్‌పై 50 శాతం రాయితీ పోగా మిగిలినవి చెల్లిస్తే సగానికి సగం మినహాయింపు వుంటుందని, అది ఈనెల 30తో ముగుస్తుందన్నారు. ఈయన వెంట ఏఈ మస్తాన్ వలి తదితరులున్నారు.

10వ తేదీ వరకు ఏపీ సేవా పోర్టల్ సేవల నిలిపివేత

క్రోసూరు/నకరికల్లు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ వార్డు సచివాలయ శాఖ నిర్వహిస్తున్న ఏపీ సేవా పోర్టల్‌ను మైక్రోసాఫ్ట్ ఎజ్యూర్ క్లౌడ్ నుంచి రాష్ట్ర డేటా సెంటర్‌కు తరలింపు(మైగ్రేషన్) చేపడుతున్న నేపథ్యంలో 7వ తేదీ నుంచి 10వ తేదీ రాత్రి వరకు కొన్ని సేవలు నిలిపివేస్తున్నట్టు వీఎస్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ ఎం శివప్రసాదు, క్రోసూరు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ కారణంగా ఆదాయ, సమగ్ర, భూమి మ్యుటేషన్‌లు, రేషన్‌కార్డులు, ఇళ్ళస్థల పట్టాలు, వృద్ధాప్య, వివాహ ధ్రువీకరణ పత్రాలు, రెవెన్యూ, వాటర్ ట్యాంక్, పట్టణ పరిపాలన సంబంధిత సేవలు, మత్స్యశాఖ సేవలు అందుబాటులో ఉండవన్నారు. మిగతా సేవలు మీసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

కొత్త పీఆర్‌సీకి పాత పీఆర్‌సీకి లింకేంటి?

సత్తెనపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటుచేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కోరుతుంటే కొత్త పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటుచేయకుంటే పాత పీఆర్‌సీ బకాయిలు ఇచ్చిన తరువాతే కొత్త పీఆర్‌సీ ఇస్తామని చెప్పటంలో పరమార్థం ఏమిటని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం సుభానీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 1, 2023 నాటికి ఇవ్వాల్సిన 12వ పీఆర్‌సీ గడువు రెండు సంవత్సరాలు పూర్తయిందన్నారు. కొత్త పీఆర్‌సీ ఏర్పాటు చేయలేదన్నారు. వెంటనే ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన అన్ని బకాయిలను చెల్లించాలన్నారు.

నేతి వెంకన్నస్వామి ఆలయానికి పాదయాత్ర

రాజుపాలెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఆకులగణపవరం గ్రామ టీడీపీ నాయకులు, మహిళలు శనివారం అధికసంఖ్యలో దేవరంపాడు నేతి వెంకన్నస్వామి సన్నిధికి వచ్చి మొక్కు చెల్లించుకున్నారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించటంతో పాటు స్థానిక ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అత్యధిక మెజార్టీతో విజయం సాధించాలని వారు మొక్కుకున్నారు. గ్రామానికి చెందిన సుమారు 200మంది పాదయాత్రగా గణపవరం నుండి బయల్దేరి దేవరంపాడు వచ్చి మొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ యువ నాయకులు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు అంచుల నరసింహారావు, ఆకులగణపవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు వడ్డెంపూడి వెంకట్రావు, నర్రా మల్లయ్య, మొరసా శ్రీనివాసరావు, బొడ్డెంపూడి లక్ష్మీనారాయణ, నల్లూరి పెద్దరాఘవయ్య, కారుమూరి సాంబశివ రావు, చల్లా మల్లేశ్వరి, ఏటుకూరి తులశమ్మ తదితరులు ఉన్నారు.


నేతి వెంకన్నస్వామిని దర్శించుకున్న గణపవరం గ్రామ టీడీపీ నాయకులు, మహిళలు

పల్లా సింహాచలం మృతికి ఎమ్మెల్యే జూలకంటి సంతాపం

మాచర్ల రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే సింహాచలం(93) మృతికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయ న ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు కుటుంబానికి తన ప్రగా ఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు పల్లా సింహాచలం మృతిపట్ల సంతాపం ప్రకటించాయి.

పారిశుధ్యంపై ఇంత నిర్లక్ష్యమా...!

దాచేపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నడికూడి-మాచర్ల ప్రధాన రహదారి పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల వద్ద చెత్త డబ్బాను బోర్లా వేశారు. దీంతో స్థానికులు చెత్తను ఆ డబ్బా చుట్టూ పారబోస్తున్నారు. దీంతో కుక్కలు, పందులు అక్కడ స్వైర విహారం చేస్తున్నాయి. దుర్గంధం వెదజల్లుతోంది. ఈ రహదారిపై నిత్యం జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయినా దీనిని పట్టించుకున్నవారు లేరు. మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనంగా కనిపిస్తోంది. అదేవిధంగా ఇరికేపల్లి, నడికూడి పెట్రోల్ బంకు సమీపంలో దాచేపల్లిలోని తంగెడ రోడ్డులో కూడా పారిశుధ్యం అధ్వానంగా ఉంది.


నడికూడి మెయిన్ రోడ్డు పక్కనే బోర్ల పడవేసిన చెత్త డబ్బ

ప్రమోషన్‌కు.. ఫాల్స్ లేఖ!

● బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో లబ్ధి ● ఉద్యోగ సంఘాల నే(మే)తల చేతివాటం ● సంఘంలో లేకున్నా..ఉన్నట్లు సిఫార్సు లేఖలు
● ఒక్కో లేఖకు రూ.లక్షల్లో వసూళ్లు ● అర్హులైన ఉద్యోగులకు అన్యాయం

గుంటూరు నగరంలో ఓ సంఘం నేత బదిలీలు, ఉద్యోగోన్నతుల సమయంలో సిఫార్సు లేఖలు ఇవ్వడమే వ్యాపారంగా మలుచుకున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ప్రతి శాఖలో ఉద్యోగులకు తన సంఘంలో ఆఫీస్ బేరర్లుగా పనిచేస్తున్నట్లు సిఫార్సు లేఖలు ఇచ్చి.. తమకు అనుకూలంగా బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందుతారని సమాచారం. సిఫార్సు లేఖల డబ్బుల విషయంలో గతంలో రెండు సంఘాలకు నడుమ కొంతకాలం అంతర్గత యుద్ధం నడిచింది.

సాంఘిక సంక్షేమ శాఖలో ఓ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఓ ఉద్యోగ సంఘం నేత ఇచ్చిన సిఫార్సు లేఖను అడ్డుపెట్టుకొని 9 ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తున్నారు.

ప్రస్తుతం బదిలీలు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరుగుతున్నాయి. కొంతమంది ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు విభజిత జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేస్తూ తమకు కూడా పాయింట్లు కేటాయించాలని ఇటీవల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయితే దీనిపై కొన్ని ప్రధాన సంఘాలు అభ్యంతరాలు లేవనెత్తడంతో రాష్ట్రస్థాయిలో ఈ ప్రక్రియకు అడ్డుకట్ట పడింది.

గుంటూరు (విద్య) జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వారెప్పుడూ ఏ ఉద్యమాల్లో పాల్గొనరు.. ఉద్యోగుల సమస్యలపై ఏనాడు కనీసం వినతిపత్రం కూడా ఇవ్వరు.. అయినా వారికి బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో భారీ లబ్ధి చేకూరుతోంది. ఉద్యోగ సంఘాల నేత, ఆఫీస్ బేరర్లు అనే ఒక్క సాకుతో ఉద్యోగోన్నతుల బదిలీల్లో పాయింట్లు కొట్టేస్తున్నారు. అర్హులైన ఉద్యోగులకు అన్యాయం చేసి.. ఇటువంటి వారి వద్ద భారీగా ముడుపులు తీసుకుని కొన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సిఫార్సు లేఖలు ఇస్తున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా అర్హులైన ఉద్యోగులు బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో భారీగా నష్టపోతున్నారు. ప్రస్తుతం అన్ని శాఖల్లో బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సమయంలో కొన్ని పాయింట్లు ద్వారా కొంతమంది భారీ లబ్ధి పొందుతున్నారు.



ప్రభుత్వ నిబంధనతో లబ్ధి..

వాస్తవంగా గుర్తింపు పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల్లో నాయకులకు, ఆఫీస్ బేరర్లకు మాత్రమే ప్రభుత్వ నిబంధన ప్రకారం కొన్ని పాయింట్లు కేటాయిస్తారు. దీని ప్రకారం ఆయా సంఘాల నాయకులు బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో లబ్ధి పొందుతారు. అయితే కొన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు తమ సంఘంలో లేని వారికి సైతం లేఖలు ఇస్తూ అర్హులకు అన్యాయం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

అప్పుడే విష ప్రచారం

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నెలలో నాలుగు సార్లు రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారు. సమస్యలు సావధానంగా విని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే కొన్ని సంఘాల నాయకులు మాత్రం ఇప్పటికే కొత్త ప్రభుత్వంపై విష ప్రచారం మొదలు పెట్టారు. గత ప్రభుత్వంలో జీతాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసిన విషయాన్ని విస్మరించి ఈ నేతలు.. వైసీపీ నాయకుల ప్రోత్సాహంతో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందంటూ, డీఏలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు రావడం లేదంటూ ప్రచారం చేస్తున్నారు.

కొన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కేవలం అధికారుల ప్రాపకం కోసం సంఘాలు నిర్వహిస్తూ సభ్యత్వం పేరుతో వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

నగరంలో ఓ ఉపాధ్యాయ సంఘం నేత కొత్తగా ఏర్పాటు అయిన ఉపాధ్యాయ సంఘంలో చేరి దాదాపు రూ.లక్షల్లో సభ్యత్వ రుసుం వసూలు చేశారు. సభ్యత్వ రుసుం లెక్కలు అడిగితే వెంటనే వేరే సంఘంలో చేరిపోయారు. లెక్కలు అడిగిన సదరు సంఘం నేతలపై ఆయన బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం.

ఓ ఉపాధ్యాయ సంఘం నేతలు ఉద్యమాలను వదిలేసి ఉపాధ్యాయులపై వచ్చే ఆరోపణలు, క్రమశిక్షణ చర్యల్ని తమకు అనుకూలంగా మలుచుకుని అవి అధికారుల వద్ద పరిష్కరించినట్లు చూపి.. భారీ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మరో ఉద్యోగ సంఘం నేతపై హత్యాయత్నం కేసు ఉంది. అయినా కూడా ఆయనను ఓ ఉద్యోగ సంఘం నాయకులు ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సంఘం ఇచ్చే లేఖలు పొంది కూడా కొంతమంది బదిలీల పాయింట్లు పొందారు. ఇలా ఉద్యోగుల సంక్షేమం సమస్యల కోసం పనిచేయాల్సిన సంఘాలు పక్కదారి పట్టి స్వలాభమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తీవ్రస్థాయిలో ఆరోపణలు వస్తున్నాయి.

తెరుచుకోనున్న.. నేటి సాయంత్రం నుంచి మిర్చి టిక్కీల దిగుమతికి అనుమతి

మిర్చి యార్డు గేట్లు

సోమవారం ఉదయం నుంచి ప్రారంభం కానున్న లావాదేవీలు

గుంటూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చి యార్డు) గేట్లు ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి తెరుచుకోనున్నాయి. వివిధ జిల్లాల నుంచి మిర్చి టిక్కీలను అమ్మకానికి తీసుకొచ్చే రైతులను మాత్రమే అనుమతించాల్సిందిగా గేట్ల సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. యార్డు ప్రాంగణం అంతటా శుభ్రం చేయించి లావాదేవీలకు సిద్ధం చేసి పెట్టారు. ఎక్కడా ట్రాఫిక్ ఏర్పడకుండా.. లారీలు, ట్రాక్టర్లు, ఆటోలలో రైతులు తీసుకొచ్చే మిర్చి టిక్కీలను సంబంధిత కమీషన్ దుకాణాల్లో దిగుమతి చేయించి.. వాహనాలను బయటకు పంపించాలని ఆదేశించారు. సోమవారం ఉదయం 7 గంటలకు బెల్ కొట్టగానే కమీషన్ వ్యాపారులు వేలం ప్రారంభించాలని స్పష్టం చేశారు.



హైవేపై మిర్చి లోడింగ్‌కు సిద్ధంగా పెట్టిన కంటైనర్లు

యార్డు తెరవగానే కొనుగోళ్లు..

గత నెల 9న ఎండల తీవ్రత దృష్ట్యా మిర్చి యార్డులో పని చేసే వాతావరణం లేకపోవడంతో హమాలీలు, వ్యాపారుల విజ్ఞప్తి మేరకు యార్డుకు వేసవి సెలవులు ప్రకటించారు. అనంతరం యార్డులో నిల్వఉన్న మిర్చి టిక్కీలన్నింటిని బయటకు తరలించి, గేట్లు మూసేశారు. దీంతో చాలామంది రైతులు తమ వద్ద ఉన్న మిర్చి టిక్కీలను కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ చేసుకొని బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొన్నారు. యార్డు మూసేసే రోజుకు క్వింటా ధర రకాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ. 13వ వేల వరకు ఉంది. అయితే ఆ తర్వాత ఎక్స్‌పోర్టు క్వాలిటీ అయిన తేజ వెరైటీ మిర్చి ధర క్వింటాకు రూ.1000 పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. ఇప్పుడు చైనా నుంచి ఎక్స్‌పోర్టు ఆర్డర్స్ ఉండటంతో యార్డు తెరవగానే కొనుగోళ్ల జోరు పెంచేందుకు ఎగుమతిదారులు సిద్ధంగా ఉన్నారు.

చెన్నై నుంచి వచ్చిన కంటైనర్లు

చైనాకు ఎక్కువగా చెన్నై, కృష్ణపట్నం పోర్టుల నుంచి మిర్చి టిక్కీలు కంటైనర్లలో ఎగుమతి చేస్తారు. ఇక్కడ కంటైనర్ లోడింగ్ అయి షిప్ ఎక్కించగానే మొత్తం నగదు ఎక్స్‌పోర్టు వ్యాపారి బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. దీంతో ఆయా పోర్టుల నుంచి కంటైనర్లు రెండు రోజుల క్రితమే గుంటూరు మిర్చియార్డు వద్దకు తీసుకొచ్చారు. ఎన్‌హెచ్-16 సర్వీసు రోడ్డులో వీటిని పార్కింగ్ చేసి పెట్టారు. సోమవారం కొనుగోళ్లు ప్రారంభం కాగానే రైతుల నుంచి మిర్చి కొనుగోలు చేసి కంటైనర్లని లోడింగ్‌కు పెట్టేందుకు ఎగుమతిదారులు ఏర్పాట్లు చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో ధర పెరుగుతుందన్న ఆశాభావం ట్రేడర్లలో వ్యక్తమవుతోంది.



తీరంలో పర్యాటకుల సందడి

బాపట్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంక సముద్ర తీరం పర్యాటకులతో సందడిగా మారింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తీరానికి పర్యాటకులు వస్తూనే ఉన్నారు. ఎండ తీవ్రత పెరిగిన నేపథ్యంలో తీరంలో చల్లటి వాతావరణంలో కుటుంబ సభ్యులతో సేద తీరారు. చిన్నారులు కేరింతలు కొడుతూ.. ఇసుకతో ఆటలాడుతూ సంతోషంగా, సరదాగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న కొలుపులు, వేడుకలు సందర్భంగా అమ్మవారి ప్రతిమలను వాహనాలలో ఊరేగింపుగా తీసుకొచ్చి సముద్రంలో స్నానం చేయించి తీసుకెళుతున్నారు. పర్యాటకులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రూరల్ పోలీసులు, మెరైన్ సిబ్బంది గజఈత గాళ్లతో గస్తీ నిర్వహించారు. బక్రీద్ సందర్భంగా పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది. ఆదివారం పర్యాటకుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉంది.



బ్రాడీపేట మెయిన్ రోడ్‌లో..



అరండల్ పేట వైపు రైల్వేస్టేషన్ వద్ద..



గాంధీ పార్క్ వద్ద..

వర్షాలకు ఎగిరిపోయిన చలివేంద్రాలు

వేసవి తాపానికి పాదచారులు, వాహనదారుల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాలు బోసిపోతున్నాయి. ఇవి ఏర్పాటు చేసిన మూడు రోజులకే వర్షాలు ప్రారంభమవడంతో వాటిని గాలికి వదిలేశారు. కొన్నిచోట్ల చలివేంద్రాలు పూర్తిగా పడిపోయాయి. గత ఐదు రోజులుగా భానుడి ప్రతాపం చూపిస్తున్నా.. కార్పొరేషన్ అధికారులు మూతపడిన చలివేంద్రాలను పునః ప్రారంభించడంలో శ్రద్ధ చూపడం లేదు.

- గుంటూరు-ఆంధ్రజ్యోతి

శివాజ్ఞతోనే 'కన్నప్ప'ను నిర్మించాం

ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మంచు మోహన్‌బాబు, విష్ణు

గుంటూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): శివుడి ఆజ్ఞ లేనేది ఏది తలపెట్టినా పూర్తి కాదని, ఆ శివాజ్ఞతోనే కన్నప్ప చిత్రాన్ని నేటితరం ప్రేక్షక లోకం కోసం నిర్మించామని అన్నారు చిత్ర నిర్మాత, నటులు మంచు మోహన్‌బాబు, విష్ణు. దాదాపుగా ఏడు ఎనిమిది సంవత్సరాలు కష్టపడితేనే చిత్రం విడుదలకు సిద్ధమైందని, ఈ నెల 27న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని వెల్లడించారు. 24 ఫ్రేంస్ ఫ్యాక్టరీ, ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా సినిమాని నిర్మించాయి.

ఆ పరమేశ్వరుడి ఆశీర్వదించడం వల్లే ఈ సినిమాలో గొప్ప గొప్ప నటులు, నటీమణులు ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, శరత్‌కుమార్, కాజల్ అగర్వాల్ వంటి వాళ్లు నటించారని మోహన్ బాబు పేర్కొన్నారు. కేవలం ఒక్క ఫోన్‌కాల్, తమ మీద ఉన్న అప్యాయత, ప్రేమ, అనురాగంతోనే పాత్రల నిడివి తక్కువైనా అంత గొప్పనటులు ఈ చిత్రంలో నటించారని పేర్కొన్నారు. భక్త కన్నప్ప వచ్చి దాదాపుగా 50 ఏళ్లు పూర్తి అయిందని, కన్నప్ప కథని ఈ తరానికి చెప్పరా అని శివుడు తమను ఎన్నుకొన్నాడని తాము భావిస్తున్నామన్నారు. సినిమా షూటింగ్ అంతా న్యూజిలాండ్‌లో పూర్తి చేశామని, వీఎఫ్ఎక్స్ కోసం అమెరికాకు వెళ్లామని వెల్లడించారు. చిత్ర నిర్మాణంలో ఎక్కడా రాజీపడకుండా ఎంతో అద్భుతంగా నిర్మించినట్లు వివరించారు. పది కాలాల పాటు ప్రేక్షకులు ఈ సినిమా గురించి, అందులో పాత్రలు చేసిన నటుల గురించి చెప్పుకొనేలా వచ్చిందని చెప్పారు.



ప్రీరిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న మోహన్‌బాబు, విష్ణు, మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకటరావు, సినీ నటులు

నాడు 60 అడుగుల కటౌట్‌ని తగలబెట్టారు

మోహన్‌బాబు తన అసెంబ్లీ రౌడీ చిత్రం విడుదల నాటి విశేషాలను ఈ సందర్భంగా తెలిపారు. అసెంబ్లీ రౌడీ సినిమా విడుదలైనప్పుడు 1991లో ఎన్ఎస్‌యూఐలో ఉన్న తాడిశెట్టి వెంకటరావు తన 60 అడుగుల కటౌట్‌ని గుంటూరులో తగలబెట్టాడని మోహన్‌బాబు గుర్తుచేశారు. దాంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో హీరో అయి ఆ తర్వాత నాయకుడిగా ఎదిగి ప్రజాదరణతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని తెలిపారు. ఇప్పుడు వెంకటరావు, ఆయన సోదరుడు మురళీ తనకు మంచి స్నేహితులై సోదరులులా ప్రేమ, అప్యాయత చూపిస్తున్నారని చెప్పారు. ఇంత పెద్ద ఈవెంట్‌ని ఎలాంటి ప్రయోజనం ఆశించకుండా నిర్వహించి విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు చెప్పారు.


గుంటూరులో కన్నప్ప యూనిట్ ర్యాలీ

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

బక్రీద్ పర్వదినం పోలీసులు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని విజయవంతం చేసేందుకు పటిష్ట బందోబస్తుని కల్పించారని.. ఈ విషయం తన మిత్రుడు, బంధువు సీఎం చంద్రబాబుకు తెలియకుండా జరగదని మోహన్‌బాబు పేర్కొన్నారు. ముందుగా ఆయనకు కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకటరావు, మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డైరెక్టర్ ముకేష్ సింగ్, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా, నటులు బ్రహ్మానందం, సప్తగిరి, రఘుబాబు, అదుర్స్ రఘు, శివబాలాజీ, విశాల్ తదితరులు హాజరయ్యారు.

పవర్ పీల్చేస్తున్నారు!

● మండుటెండలతో పెరుగుతోన్న విద్యుత్ వినియోగం
● వారం రోజుల వ్యవధిలోనే గణనీయంగా పెరిగిన డిమాండ్
● ఉమ్మడి జిల్లాలో 21.6 మిలియన్ యూనిట్లకు చేరుతున్న వాడకం

గుంటూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపంతో ఎండలు భగ్గుమంటున్నాయి. అదే స్థాయిలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుతోంది. విభజిత గుంటూరు సర్కిల్‌తో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని విద్యుత్ డిమాండ్ రోజురోజుకు పెరుగుతోంది. విద్యుత్ వినియోగాన్ని పరిశీలిస్తే డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ముఖ్యంగా వారం రోజుల వ్యవధిలోనే విద్యుత్ డిమాండ్‌ను పరిశీలిస్తే గణనీయంగా పెరిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గత నెల 31న 17.727 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగం ఉండగా వారం రోజుల వ్యవధిలోనే ఈ నెల 6న 21.6 మిలియన్ యూనిట్లకు పెరిగింది. రోజు రోజుకు ఒకటి నుంచి రెండు మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం పెరుగుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇక విభజిత జిల్లాలోని గుంటూరు సర్కిల్ పరిధిలో గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌ల పరిధిలో విద్యుత్ వినియోగం ఇటీవల పరిశీలిస్తే ఏ స్థాయిలో విద్యుత్ వినియోగం పెరిగిందో అర్థమవుతోంది. గత నెల 31న గుంటూరు, తెనాలి డివిజన్‌లలో 5.881 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉండగా అది కాస్త క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఈ నెల 6న వినియోగం పరిశీలిస్తే 7.516 మిలియన్ యూనిట్లకు చేరినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం కూడా ఆ స్థాయిలో పెరుగుతోంది. ముఖ్యంగా మధ్యాహ్నం, రాత్రిళ్లు విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందని ఆ శాఖ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం ఎయిర్ కండీషనర్లు, కూలర్లు వినియోగిస్తున్నారు. రాత్రిళ్లు ఏసీల వినియోగం పెరగటం విద్యుత్ డిమాండ్ పెరుగుదలకు కారణాలుగా చెబుతున్నారు.



పొదుపుగా వినియోగించుకోవాలి



విద్యుత్‌ను సాధ్యమైనంత వరకు పొదుపుగా వినియోగించుకోవాలి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం సూర్య ఘర్.. ద్వారా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. మిగులు విద్యుత్‌ను విక్రయించుకోవచ్చు.

- కేవీఎల్ఎన్ మూర్తి, ఎస్ఈ, గుంటూరు సర్కిల్ ఆపరేషన్స్

ఆర్టీసీ స్టీరింగ్ ఇన్‌చార్జిల చేతిలో..

● రెండు డిపోలకు ఇన్‌చార్జి డిఎంలే దిక్కు ● డిప్యూటీ సీఎంఈ కూడా ఇన్‌చార్జే

గుంటూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): విభజిత గుంటూరు జిల్లా పరిధిలోని ఆర్టీసీ కొద్దికాలంగా ఇన్‌చార్జిల పాలనలో కొనసాగుతోంది. ఇన్‌చార్జిలతో ఒక వైపు పాలన నత్తనడకలో సాగుతుండగా మరో వైపు అధికారులకు తలకుమించిన భారంగా పరిణమిస్తోంది. జిల్లా పరిధిలో గుంటూరు- 1, 2 డిపోలతో పాటు మంగళగిరి, పొన్నూరు, తెనాలి డిపోలున్నాయి. ఐదు డిపోలుంటే రెండు డిపోల మేనేజర్లకు అదనపు విధులు కేటాయించడం విశేషం. ఇందులో గుంటూరు-1 డిపో మేనేజర్ రామకృష్ణ విదేశీ పర్యటనకు వెళ్లగా తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన పర్యవేక్షణ అంతంతమాత్రంగా ఉండటంతో డిపో కార్యాలయంలో సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా ఈ డిపోలో అక్రమ ఓడీలతో కొందరు కిందిస్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహ రిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఇక గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం గత నెలలోనే పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో మంగళగిరి డిపో మేనేజర్ ఆర్ పిచ్చయ్యను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన రెండు డిపోలను పర్యవేక్షణ చేయాలంటే తలకుమించిన భారంగా మారుతోంది. గతంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ (డిప్యూటీ సీఎమ్ఈ)గా పనిచేసిన నర్రా వెంకటేశ్వరరావు బదిలీపై విజయవాడ వెళ్లడంతో ఆయన స్థానంలో ఎన్టీఆర్ బస్టాండ్ ఏటీఎంగా వ్యవహరిస్తున్న కె.సత్యనారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులతో అతి పెద్దదైన ఎన్టీఆర్ బస్టాండ్‌కు ఏటీఎంగా ఉన్న సత్యనారాయణకు డిప్యూటీ సీఎంఈ బాధ్యతలు తలకుమించిన భారంగానే చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని డిపోలు నష్టాలతో కొట్టుమిట్టాడుతుండగా మరో వైపు ఇన్‌చార్జిల పాలన నడుస్తుండటం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది.


ఎన్టీఆర్ బస్టాండ్

డిపోల్లో అధికారుల పర్యవేక్షణ ఏది...!

గుంటూరు-1, 2 డిపోలు ఇన్‌చార్జిల పాలనలో ఉండటంతో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందన్న విమర్శలు ఉన్నాయి. దాంతో ఈ రెండు డిపోల్లో కొందరు సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పూర్తి స్థాయిలో అధికారులను నియమించాలని కోరుతున్నారు.

జీవీ ఆంజనేయులుకు గోరంట్ల కృతజ్ఞతలు

వినుకొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఈపూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా ఎంపికైన శావల్యాపురంనకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు గోరంట్ల సత్యనారాయణ ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతో పాటు డీసీసీబీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావును శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలవేసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో తనకు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు, కష్టపడి రైతులకు సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అలోకం సుదాకర్ బాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, వినుకొండ బీజేపీ నాయకులు లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగమ్మ ఆలయ ప్రతిష్ఠ



పమిడిపాడులో ప్రతిష్ఠకు సిద్ధమైన గంగమ్మ గుడి

బొల్లాపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పమిడిపాడు గ్రామంలో ఆదివారం గంగమ్మ గుడి, వీరభద్రుడు, వినాయక స్వామి, బొడ్డురాయి ప్రతిష్ఠా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా పమిడిపాడు గ్రామంలో చుట్టాల రాకతో పండుగ వాతావరణం నెలకుంది. ఆదివారం నూతన దేవాలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

బొప్పూడిలో పోలీసుల పల్లెనిద్ర

చిలకలూరిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం బొప్పూడిలో ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి రూరల్ ఎస్ఐ జి.అనిల్‌కుమార్ పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఆయన సమావేశమయ్యారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన, ప్రోత్సహించిన వారిపై కఠినచర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు. బహిరంగంగా మద్యం తాగి మహిళలపై దాడులు, అత్యాచారాల వంటి నేరాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైమ్, ఆస్తి గొడవలు, ఆత్మహత్యలు, గంజాయి స్మగ్లింగ్ వంటి అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించి, వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేసి, తీసుకో వాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అనుమానాస్పద కార్యకలాపాలు దృష్టికి వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామ పెద్దలు పూసల హరిబాబు, గుంటు కోటేశ్వరరావు సమావేశంలో పాల్గొన్నారు.

గుండె పోటుతో హోంగార్డు మృతి

వినుకొండటౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న హోంగార్డు విజయబాబు(40) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందినట్లు సీఐ శోభన్‌బాబు శనివారం తెలిపారు. సమాచారం తెలుసుకున్న సీఐతో పాటు సిబ్బంది వినుకొండ మండలం నీల గంగారంలో బౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

రేపటి నుంచి యోగా శిక్షణ శిబిరం

చిలకలూరిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాదినేని చౌదరయ్య స్కూల్ ప్రాంగణంలో శ్రీవెంకటేశ్వర యోగాసేవా కేంద్రం గురూజీ శ్రీవెంకటేశ్వర యోగి ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ సోమవారం నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక యోగా గురూజీ శిఖాకొల్లి రాంబాబు శనివారం తెలిపారు. శిబిరం కాపుగంటి శివప్రసాద్ గురూజీ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామని, పుర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 5 నుంచి 7 గంటల వరకు నెల రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు.

సింహాచలం మృతి బాధాకరం

చిలకలూరిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం అనారోగ్యంతో మరణించడం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం పేర్కొన్నారు. పల్లా శ్రీనివాసరావుకి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టెంట్లు పడిపోయిన సంఘటనపై పోలీసుల విచారణ

చిలకలూరిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ సందర్భంగా ప్రార్థనల కోసం శుక్రవారం రాత్రి పట్టణంలోని పురుషోత్తపట్నం బైపాస్ పక్కన ఉన్న ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు శనివారం ఉదయం పడిపోయి ఉండడం చర్చనీయాంశమైంది. టెంట్లను గుర్తు తెలియని వ్యక్తులు పడగొట్టినట్లు అనుమానం వ్యక్తం చేస్తూ మొహిద్దిన్ అనే వ్యక్తి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకుని ఆ ప్రాంతానికి చేరుకున్న అర్బన్ ఎస్ఐ చెన్నకేశవులు ఘటన గురించి విచారణ జరిపారు. శనివారం ఉదయం అక్కడి టెంట్లు సరిచేసి ముస్లింలు యధావిధిగా ప్రార్థనలు జరిపారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు
● రూ.70లక్షలతో రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన



ఏనుగుపాలెంలో రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన చేసిన ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 80 శాతం హామీలను అమలు చేసిన ఘనత కూటమి దేనని.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని ఏనుగుపాలెంలో జల్‌జీవన్ మిషన్ కింద సుమారు రూ.71.30 లక్షలతో ఇంటింటికి కుళాయి ద్వారా తాగునీరు అందించే పథకానికి జీవీ శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం నూతన ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం నిధుల ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించక పోవడంతో ఎన్నో పథకాలు వైసీపీ ప్రభుత్వం ఆపివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిలోనే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుందని తెలిపారు, 60 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించనున్న తాగునీరు ట్యాంకు ద్వారా 450 ఇళ్లకు రక్షిత మంచినీరు సరఫరా చేయనున్నామన్నారు. మరో 350 ఇళ్లకు కుళాయి కనక్షన్లు ఇచ్చేందుకు రూ.25 లక్షలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరానని, ఆ నిధులు సమకూర్చితే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ఐదేళ్లుగా జల్‌జీవన్ మిషన్ పనులు వైసీపీ ఎందుకు చేయలేకపోయిందో చెప్పాలని ప్రశ్నించారు. ఇచ్చిన హామీల్లో కనీసం 10శాతం కూడా అమలు చేయలేని అసమర్థ పాలన జగన్‌దని ఎద్దేవా చేశారు. రానున్న కాలంలో ప్రతి గ్రామానికి జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందించే కార్యక్రమం చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగశ్రీను, మాదినేని ఆంజనేయులు, డీసీ కొండలు. గోవిందరాజులు, కృష్ణ, కర్నాటి వెంకటరెడ్డి, ఉమ్మడివరం సర్పంచ్ ఆనంద్, గ్రామపెద్దలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం పిల్లల చదువులకు అండగా ఉంటా..

పల్నాడు ప్రాంతంలోని ముస్లిం విద్యార్థుల చదువు కోసం సాయమందించేందుకు సదా సిద్ధంగా ఉంటానని, ఉపకార వేతనాలు పంపిణీలో తనవంతుగా భాగస్వామ్యం అవుతానని ముస్లింలకు జీవీ ఆంజనేయులు హామీ ఇచ్చారు. బక్రీద్‌ను పురస్కరించుకుని తిమ్మాయిపాలెం రోడ్డులోని ఈద్గా వద్ద ముస్లింలు శనివారం సామూహిక ప్రార్థనలు చేశారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంపాదించిన దాంట్లో కొంత బాగం పేదలకు పంచి పెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ తెలుపుతుందన్నారు. అదే స్ఫూర్తితో ఏటా ముస్లింలు, ఏటా ప్రతి మసీదు నుంచి కొంత డబ్బు వసూలు చేస్తే, తాను 25 శాతం ఇస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు ఆర్థిక ప్రగతి సాధించాలని, చదువులో ముందుకెళ్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

కంటి వైద్యశిబిరాల నిర్వహణ

వినుకొండ నియోజవర్గం వ్యాప్తంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల్లో కంటి సమస్యలతో బాధ పడుతున్నవారికి ఉచిత కంటి వైద్యశిబిరాలను నిర్వహించడం గొప్ప అవకాశంగా భావిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తామని జీవీ ఆంజనేయులు తెలిపారు. శివశక్తి కార్యక్రమాల ద్వారా ఎంతో మందికి తిరిగి కంటి చూపు ఇవ్వడం, చూపు మెరుగుపడడం జరుగుతుండటం ఎంతో సంతృప్తిగా ఉందని తెలిపారు. వినుకొండ గంగినేని కల్యాణ మండపంలో శివశక్తిలీలా అంజన్ ఫౌండేష్ ఆధ్వర్యంలో శనివారం కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా జీవీ పాల్గొన్నారు.

హజ్రత్ ఇబ్రహీం త్యాగం, ప్రేమ, కరుణకు ప్రతీక బక్రీద్

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



బక్రీద్ నమాజ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ, పట్టణ ముస్లింలు



తిమ్మాయిపాలెం రోడ్డులోని ఈద్గావద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

నరసరావుపేట టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగం, ప్రేమ, కరుణ, మతసామరస్యానికి నిదర్శనం బక్రీద్ పర్వదినమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం నరసరావుపేట పట్టణంలోని షాదీఖానా ఈద్గాలో బక్రీద్ నమాజ్ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ హజ్రత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా పండుగ జరుపుకుంటారని, మతాలకు అతీతంగా ప్రజలంతా ప్రేమానురాగాలతో జీవించాలని అన్నారు. మతం వేరైనా మానవులంతా ఒక్కటేనని ప్రతి పండుగ మనకు గుర్తుచేస్తుందన్నారు. బక్రీద్ పర్వదినాన్ని ప్రతి ముస్లిం ఆనందంగా జరుపుకునే విధంగా అల్లా అనుగ్రహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మన్నాన్ షరీఫ్, నియోజకవర్గం అధ్యక్షుడు షేక్ మాబు, పాల్గొన్నారు.

● **శావల్యాపురం, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, శానంపూడి, శావల్యాపురం, పోట్లూరు, కొత్తలూరు, వేల్పూరు తదితర గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకొన్నారు.

● **బొల్లాపల్లి, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని బొల్లాపల్లి, గుమ్మనంపాడు, మేళ్ళవాగు, పేరూరుపాడు, రామాపురం, గుట్లాపల్లి తదితర గ్రామాల్లో బక్రీదును శనివారం ఘనంగా నిర్వహించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● **చిలకలూరిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి):** బక్రీద్ పండుగను పురస్కరించుకుని ముస్లింలు పెద్ద సంఖ్యలో పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్ వద్ద ఉన్న ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పురుషోత్తపట్నం ఈద్గా, మద్దినగరంలో మదరసా వద్ద కూడా ప్రార్థనలు జరిగాయి. ఈద్గాల వద్ద వద్ద మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని సహకారంతో అంజుమన్ కమిటీ వారు ప్రార్థనలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

● **నాదెండ్ల (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పలు గ్రామాల్లో బక్రీదును ముస్లింలు ఘనంగా నిర్వహిం చారు. ముస్లింలు అధికంగా ఉన్న గణపవరం, తూబాడు, సాతులూరు, గొరిజవోలు, మైనంపాడు, నాదెండ్ల తదితర గ్రామాల్లో గల ఈద్గాలు, పాఠశా లల ప్రాంగణాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని మౌలానాలు బక్రీదు ప్రాముఖ్యతను వివరించారు.

● **యడ్లపాడు (ఆంధ్రజ్యోతి):** మండలంలోని యడ్లపాడు, బోయపాలెంలోని ఈద్గాలతోపాటు కోట, కొండవీడు, వంకాయలపాడు, కారుచోల, తిమ్మాపురం గ్రామాల్లోని మసీదులు వద్ద ముస్లింపెద్దల ఆధ్వర్యం లో సామూహిక ప్రార్థనలు జరిగాయి. బక్రీద్ పండుగ త్యాగాన్ని, పేదల పై జాలిని, మానవతా విలువలను తెలియచేస్తుందన్నారు. నమాజు అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



చిలకలూరిపేట ఈద్గా వద్ద బక్రీద్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

సాగునీరు వృథా కాకుండా శాశ్వత మరమ్మతులు

● లింగంగుంట్ల సర్కిల్ డీఈఈ విజయలక్ష్మి



ఎస్కేప్ చానల్‌ను పరిశీలిస్తున్న డీఈఈ విజయలక్ష్మి

శావల్యాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు ప్రభుత్వం అందించే సాగునీరు వృథా కాకుండా చివరి భూముల వరకు చేర్చేందుకు అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో నున్న మరమ్మతులను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు అడుగులు వేస్తున్నట్లు లింగంగుంట్ల సర్కిల్ డీఈఈ విజయలక్ష్మి అన్నారు. అద్దంకిబ్రాంచ్ కెనాల్ పరిధిలోని 18వ మైలురాయి సమీపంలోని ఎస్కేప్ చానల్‌ను ఆమె శనివారం క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఇటీవల ఎస్కేప్ చానల్ వద్ద రేకు వంగిపోయి సాగునీరు వృథా కావడంతో ఇసుక బస్తాలు అడ్డంగా వేసి తాత్కాలిక మరమ్మతులు చేశామని, ఇప్పుడు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. అన్నవరప్పాడు మేజర్ పరిధిలో అలుగు వద్ద గతంలో నిర్మించిన కట్టడాలు కూడా పూర్తిగా పాడై పోయాయని, సాగునీరు ఎక్కువగా విడుదల చేసిన సమయంలో పోట్లూరు మేజర్ పరిధిలో సైఫన్ వద్ద మరమ్మతుల కారణంగా సాగునీరు కిందకు వెళ్లకుండా వృథాగా పోతుందన్నారు. దానిని అరికట్టేందుకు శానంపూడి మేజర్ పరిధిలోని గంటవారిపాలెం నుంచి బొందిలిపాలేనికి వెళ్లే రోడ్డుపై వంతెననిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో సమస్యలను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులకు ప్రభుత్వం ద్వారా వెంటనే నిధులు విడుదల చేయించాలని కోరనున్నట్లు తెలిపారు. సాగునీటి సంఘాల అధ్యక్షులు గుత్తా సీతారామయ్య, కామినేని శ్రీనివాసరావు, ఎన్నెస్పీ ఏఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ వెంకటేశ్వరరావు సంతాప సభ



వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాగసరపు సుబ్బరాయగుప్తా, కపిలవాయి విజయకుమార్ తదితరులు

నరసరావుపేట టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో కళాశాల ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు సంతాపసభ శనివారం జరిగింది. వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి కళాశాల పాలకవర్గం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్ మాట్లాడుతూ పెనుగొండ వెంకటేశ్వరరావు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెం ట్ నాగసరపు సుబ్బరాయగుప్త మాట్లాడుతూ వెంకటేశ్వరరావు శ్రీసీతారామస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేశారని, మెరిట్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చేవారని అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొలిశెట్టి రామ్మోహనరావు, కూనిశెట్టి లక్ష్యయ్య, వక్కలగడ్డ కోటేశ్వరరావు, బత్తుల వెంకట మురళీధరరావు, తాడేపల్లి వెంకట భావన్నారాయణ, ఊటుకూరి రంజిత్‌కుమార్, పెనుగొండ ప్రభాకర్, ప్రతాప్, ప్రిన్సిపాల్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాససాయి నివాళి అర్పించి, ఆయన సేవలు కొనియాడారు.

నాటు సారా నిర్మూలనకు యాక్షన్ ప్లాన్

ఈపూరు, బొల్లాపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నాటు సారా నిర్మూలన కోసం ఈనెల 20వతేదీ వరకు యాక్షన్ ప్లాన్ షెడ్యూల్ ఇచ్చామని పల్నాడు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కే మణికంఠ అన్నారు. ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. బ్రిడ్జి తండా, బోడిపాలెంతండా, ఇనమెడ తండా, గండిగనుములలో తనిఖీ చేశారు. అనంతరం డీపీఈవో మణికంఠ మాట్లాడుతూ సారా కేసులో ముద్దాయిల మీద నిఘా ఉంచడంతో పాటు గ్రామస్తులు, గ్రామ అధికారులతో సమన్వయంగా వ్యవహరించి సారాయిని నిర్మూలిస్తామన్నారు. గ్రామాల్లో నాటు సారా సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే పేర్లు గోప్యంగా ఉంచుతామన్నామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బీ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థికి రూ.లక్ష ఆర్థిక సాయం



చెక్కును విద్యార్థికి అందజేస్తున్న తహసీల్దార్ హరేన్సన్

చిలకలూరిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కావూరి గ్రామానికి చెందిన పల్లపు శ్రీహర్షకు మంగళగిరికి చెందిన సేవా సంస్థ గివింగ్ బ్యాక్ టూ సొసైటీ వారు శనివారం రూ.లక్ష ఆర్థికసాయం చేసింది. విజయవాడలోని శ్రీచైతన్య స్కూల్లో చదివిన పల్లపు శ్రీహర్ష ఇంటర్లో 921 మార్కులు సాధించాడు. ఇంజనీరింగ్ చదువుకునేందుకు ఈ సంస్థ వారు ప్రోత్సాహకంగా ఈ సాయం అందించింది. తహసీల్దార్ మహమ్మద్ హరేన్సన్ చెక్కును విద్యార్థికి అందజేశారు.

కేజీబీవీ పాఠశాల చుట్టూ కంపచెట్ల తొలగింపు



పాఠశాల చుట్టూ కంపచెట్లను తొలగిస్తున్న కూలీలు

ఈపూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఈపూరు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం చుట్టూ అల్లుకుపోయిన కంపచెట్లు, చెత్తా, చెదారాన్ని శనివారం తొలగించారు. పాఠశాల వెనుకవైపు మురుగుగుంతలు, పిచ్చిచెట్లు ఉండి రాత్రివేళలో పాములు తిరుగుతున్నాయి. సర్వశిక్షాభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వరదా సుబ్బారావు, జీడీసీవో రేవతిలు పాఠశాలను సందర్శించి అసహనం వ్యక్తం చేశారు. అధికారుల సూచనల మేరకు పాఠశాల చుట్టూ ఉన్న పిచ్చి కంపను తొలగిస్తున్నారు. గోడలపై మొలిచిన మర్రి మొక్కలను కూడా తొలగించాలని ఏపీసీ సూచించారు.

స్కాలర్ షిప్‌కు ఎంపికైన మోడల్ పాఠశాల విద్యార్థులు

రొంపిచర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలో మండలంలోని పీఎం శ్రీఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు జాతీయ ప్రతిభా పురస్కార స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ బీ రవినాయక్ శనివారం తెలిపారు. 8వ తరగతి విద్యార్థులు కొప్పరపు పూజిత, కొర్లపాటి గణేష్, నారే శశిప్రియ, ఏపూరి జ్యోతి స్వరూప, పాత లావత్ భవ్యశ్రీ బాయి ఎంపికైనట్టు తెలిపారు. వీరికి నాలుగు సంవత్సరాల పాటు సంవత్సరానికి రూ.12వేలు అందుతాయన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రవినాయక్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అభినందించారు.

● బొల్లాపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు ప్రతిభా అవార్డులు ప్రకటించినట్టు ఎంఈవో పీ పార్వతి శనివారం తెలిపారు. వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులకు, బొల్లాపల్లి ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఒక విద్యా ర్థికి అవార్డులు వచ్చాయన్నారు. ఈ సంద ర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

● ఈపూరు (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులను కూటమి ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపిక చేసింది. అవార్డులను కలెక్టర్ చేతుల మీదగా విద్యార్థులకు అందిస్తారన్నారని తెలిపారు.

మహిళా ద్వేషి జగన్‌కు రాష్ట్రంలో స్థానం లేదు

● ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్త్రీలను గౌరవించే రాష్ట్రంలో మహిళా ద్వేషి జగన్‌కు స్థానం లేదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం ఒక ప్రకటనలో అన్నారు. జగన్‌కు తొలి నుంచి మహిళలంటే చిన్నచూపేనని, కన్న తల్లిని, తొడబుట్టిన చెల్లినే గౌరవించని వ్యక్తి, వారి సంతోషాన్ని జీర్ణించుకోలేని వ్యక్తి ఇతర మహిళల్ని గౌరవిస్తాడని అనుకోవడం దురాశే అన్నారు. అవినీతిసొమ్ముతో పెట్టిన సొంత మీడియా చేతిలో ఉందికదా అని జగన్ ఇష్టమొచ్చినట్టు ప్రవర్తిస్తున్నాడని అన్నారు. రాజధాని మహిళల్ని కించ పరిచిన సాక్షి ఛానల్‌కు, ఆ టీవీ సిబ్బందికి, దాని సృష్టికర్త జగన్‌కు రాష్ట్ర మహిళలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. తన అవినీతి ఛానల్‌లో పనిచేసే బుద్ధిహీనులు రాజధాని మహిళలపై చేసిన సంస్కారహీన వ్యాఖ్యలకు ముమ్మాటికీ జగన్‌రెడ్డే బాధ్యుడన్నారు. సాక్షిఛానల్, పత్రిక సృష్టికర్తగా జరిగిన తప్పుకు నైతిక బాధ్యత వహిస్తూ జగన్ తక్షణమే రాష్ట్ర మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. రాజధాని మహిళల్ని భేషరతుగా క్షమాపణలు వేడుకోవాలన్నారు. సాక్షి ఛానల్, పత్రిక పుట్టుక నుంచి తగిన విచారణ జరిపి ప్రతికా స్వేచ్ఛ ముసుగులో అడ్డగోలుగా చేస్తున్న దుష్ప్రచారంపై లోతుగా విశ్లేషించాల్సిన బాధ్యత ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు.

జగన్ క్షమాపణ చెప్పకపోతే ప్యాలెస్‌ను ముట్టడిస్తాం

● టీడీపీ అధికార ప్రతినిధి గద్దె అనంతలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి మహిళా నాయకులు

నరసరావుపేట టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విషపత్రిక సాక్షిలో విశ్లేషణల పేరుతో మహిళల వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్న విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, జగన్ తక్షణమే క్షమాపణ చెప్పకపోతే ఆయన ప్యాలెస్‌ను ముట్టడి స్తామని టీడీపీ అధికార ప్రతినిధి గద్దె అనంతలక్ష్మి అన్నారు. శనివారం నరస రావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగిం ది. ఈ సందర్భంగా గద్దె అనంతలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల సాక్షి చానల్‌లో మహిళలను కించపరిచేలా నిర్వహించిన కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండించారు. మరో అధికారప్రతినిధి మానుకొండ జాహ్నవి మాట్లాడుతూ ఆ ఛానల్, పత్రిక నిర్వాహకురాలు భారతికూడా మహిళే కదా అన్నారు. వారిని కూడా ఈ గాటనే కట్టేస్తున్నారా అని మండిపడ్డారు. దళిత మహిళలను కించపరిచేలా మాట్లాడిన వారిపై సుమోటోగా కేసు నమోదు చేయాలని రాష్ట్ర హోమ్ మంత్రి, మహిళా కమిషన్, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనసేన మహిళా కార్యదర్శి మీరియాల వెంకట సుబ్బమ్మ మాట్లాడుతూ మహిళా వ్యక్తి త్వ హననాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీజేపీ నియోజకవర్గ మహిళా మోర్చా అధ్యక్షురాలు కేసరి గాయత్రి మాట్లాడుతూ సాక్షి నిర్వాహకులు క్షమా పణ చెప్పకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయన్నారు. సమావేశంలో జన సేన వీర మహిళ జక్కుల నిర్మల, తెలుగుమహిళ నాయకురాలు పాలడుగు రత్నకుమారి, చింతపల్లి శారద, ఉప్పటూరి తులసీ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో తెలుగుమహిళల ఫిర్యాదు

చిలకలూరిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రాంత మహిళలను నీచంగా జగన్ మీడియాలో మాట్లాడిన జర్నలిస్టు కృష్ణంరాజు, మాట్లాడించిన కొమ్మినేని శ్రీనివాసరావులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చిలకలూరిపేట తెలుగుమహిళలు విలేకరుల సమావేశంలో శనివారం డిమాండ్ చేశారు. సమావేశంలో మిరియాల రత్నకుమారి, చెన్నంశెట్టి పద్మ, తులసమ్మ, సుభాషిణి, అఖిలా బాయి, కణికరం పాల్గొన్నారు. అమరావతిని, మహిళ లను దారుణంగా అవమానించిన ఇద్దరిపైనా చర్యలు తీసుకోవాలని చిలకలూరిపేట అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ఎన్ విద్యార్థి ఎంపిక



ఎస్ జగదీశ్

నరసరావుపేట టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): భువనేశ్వర్‌లో కళింగ స్టేడియం ఆక్వాటిక్ పూల్‌లో జరిగే 78వ జాతీయ సీనియర్స్ స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి ఎస్ జగదీశ్ ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ ఎంఎస్ సుధీర్ శనివారం తెలిపారు. ఈ జాతీయ సీనియర్స్ స్విమ్మింగ్ పోటీలు ఈ నెల 22న నుంచి 26 వరకు జరుగుతాయన్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో ఈ నెల 1న జరిగిన 11వ సీనియర్ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడన్నారు. జగదీశ్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్త, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ పానుగంటి శ్రీనివాససాయి, పీడీ యక్కల మధుసూదనరావు, పాలకవర్గ సభ్యులు అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి నా స్థలం కబ్జా చేయించారు

● మాజీ సైనిక ఉద్యోగి వెంకటరెడ్డి ఆవేదన

గుంటూరు సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో ఉన్న తన కాంప్లెక్స్ స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రోద్బలంతో కొందరు వ్యక్తులు కబ్జా చేశారని మాజీ సైనిక ఉద్యోగి పొందుగుల వెంకటరెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన స్థలాన్ని ఆక్రమించేందుకు కాంప్లెక్స్‌లో ఉన్న రూమ్‌లు పగలగొట్టి రూ.40 లక్షలు నష్టపరిచారని ఆరోపించారు. వార్డు సచివాలయానికి దారిని ఏర్పాటు చేసేందుకు అప్పట్లో అధికారులు, కొందరు రౌడీ షీటర్లు తనపై దౌర్జన్యానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. వార్డు సచివాలయం అసలు దారిని గోపిరెడ్డి మనుషులు దొంగ రిజిస్ట్రేషన్ చేసి అమ్ముకున్నారని తెలిపారు. ఈ వ్యవహారంపై తాను పోలీసులకు, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసానని చెప్పారు. మాజీ సైనిక ఉద్యోగి అయిన తనపై గోపిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చాలా దుర్మార్గంగా వ్యవహరించారని ఆరోపించారు. అధికారం అడ్డంపెట్టుకొని ఆయన చేసిన భూకబ్జాలు, అరాచకాలు గురించి ప్రశ్నించిందుకు వయసులో పెద్దవాడిని అని కూడా చూడకుండా తప్పుడు కేసులు పెట్టించి జైల్లో వేయించారని ఆవేదన చెందారు. నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే ఆరాచకంపై కూటమి ప్రభుత్వంలోని ముఖ్యనేతలకు కూడా ఫిర్యాదు చేశానని చెప్పారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని న్యాయం చేయాలని వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు.

మనవళ్లు దాడి చేశారంటూ స్టేషన్లో కేసు

యడ్లపాడు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం కొండవీడు గ్రామంలో దారుణ ఘటన జరిగింది. ఒకరికి అమ్మమ్మ, మరొకరికి నాయనమ్మ అయ్యే వృద్ధురాలిపై దాడి చేశారంటూ బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండవీడు గ్రామానికి చెందిన తోట లక్ష్మీకాంతమ్మ తన మనవళ్లు మహేష్‌బాబు, దమ్ము రామారావులకు తరచూ ఖర్చులకు డబ్బులు ఇస్తుంటుంది. ఈ విషయాన్ని వారి తల్లులకు చెప్పిందని ఆగ్రహిస్తూ ఈ నెల 4న మహేష్‌బాబు తన నాయనమ్మతో గొడవపడి జుట్టుపట్టుకుని కొట్టాడంటూ ఫిర్యాదులో పేర్కొంది. దాడి చేయగానే ఆమె భయపడి కొండవీడు నుంచి చిలకలూరిపేటలో నివాసం ఉంటున్న కుమార్తె మాధవి వద్దకు వెళ్లింది. అయినా ఆమెకు ఫోన్లు చేసి బెదిరిస్తూ వేధించడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. దీనితో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ శనివారం తెలిపారు.

హుదా సొసైటీ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ

చిలకలూరిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అబ్బాస్ నగర్ లో హుదా సొసైటీ ఆధ్వర్యంలో 200 పేదలు, వితంతువులకు శనివారం పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం జరిగింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మొహమ్మద్ అబ్బాస్ ఖాన్ నేతృత్వంలో బక్రీద్ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు.